సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
12.5.2024

# నిస్వార్థ సేవామూర్తులు

# నైటింగేల్ నర్సులు







## చైర్మన్‌తో ముఖాముఖి

**పీకే.. ప్రశాంత్ కిషోర్.. ఈ పేరు తెలియని రాజకీయ నాయకుడు ఉండరేమో. ఇప్పుడు అన్ని పార్టీలలో ఆతన్ని తమ అడ్వయిజర్‌గా నియమించుకునేందుకు పోటీ పడుతున్నాయి,. రాజకీయ నేతల వ్యూహాలను మించి పికె జనాకర్షణ చేయగలడా? మఈకేమనిపిస్తోంది.**

**- వెలమల అప్పారావు, శ్రీకాకుళం**

అవును ఇప్పుడు పరిస్తితి అలానే కనిపిస్తోంది అప్పారావుగారూ.... ఏ రాష్ట్రంలో అధికారంలోకి రావాలంటే పికె రావాల్సిందే. ఆయనను వాడాల్సిందే. అంతటి రాజకీయ చతురత ఆయనది. ఏ ఎన్నికల్లో అయినా ఆయన వ్యూహరచన చేశారంటే ఆ పార్టీ ఖచ్చితంగా గెలవాల్సిందే. అంతటి పర్‌ఫెక్ట్‌గా ప్లాన్ చేయడంలో ధిట్ట. ఇప్పుడు దేశంలో అనేక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇప్పటికే బీహార్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. త్వరలో పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ ఆ తర్వాత పంజాబ్ వంటి రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ప్రశాంత్ కిషోర్ బిజీగా మారనున్నాడు.

2019 ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేశారు. ఫైనల్‌గా ఆ పార్టీకి అఖండ విజయాన్ని సాధించిపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల తర్వాత దేశ వ్యాప్తంగా ప్రశాంత్ కిషోర్ పేరు మారుమోగింది. ఇటీవల ఢిల్లీ ఎన్నికల్లో కూడా ప్రశాంత్ కిషోర్ ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా వన్ సైడ్ విజయం నమోదు చేసుకుంది.

ఇక ఇప్పుడు అన్ని పార్టీల చూపు ప్రశాంత్ కిషోర్‌పై పడింది. తమిళనాడులో ఇప్పటికే డీఎంకే ప్రశాంత్ కిషోర్‌ను ఎన్నికల వ్యూహకర్తగా నియమించుకుంది. వచ్చే ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరగనున్నాయి. మరో మూడేళ్లు ఉన్నప్పటికీ కర్ణాటకలో జనతాదళ్ ఎస్ అధినేత కుమారస్వామి కూడా ప్రశాంత్ కిషోర్‌ను ఎన్నికల వ్యూహకర్తగా నియమించు కోవాలనుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తరపున కూడా ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు. మమత బెనర్జీతో ఆయన టీం ఇప్పటికే కనెక్ట్ అయి సేవలందిస్తోంది. ఇక ప్రశాంత్ కిషోర్ తాజాగా పంజాబ్‌లోనూ జాతీయ పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించనున్నారట. పంజాబ్‌లో మరో ఏడాదిన్నరలో ఎన్నికలు జరగనున్నాయి. ప్రశాంత్ కిషోర్‌ను ఎన్నికల వ్యూహకర్తగా నియమించుకోవాలని ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ నిర్ణయించారట. అంటే.. పీకే పంజాబ్‌లో కాంగ్రెస్ తరఫున ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించనున్నారన్నమాట. మరి రానున్న రోజులలో పికెకి మరింత డిమాండ్ లభించే ఆస్కారం కనిపిస్తోంది.

**ప్రపంచవ్యాప్తంగా, భారత దేశంలో కూడా గుండె జబ్బుల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న కరోనా మహమ్మారి నేపధ్యంలో హెల్తీ లైఫ్‌స్టైల్ గడపడానికి కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితి ఎదుర్కొనాలంటే ఏం చేయాలి.**

**- రావుపల్లి రమేష్ బాబు , హైదరాబాద్**

అవును రమేష్ గారూ.... మన లైఫ్ స్టైల్ మన హెల్త్‌ని డిసైడ్ చేస్తుందని మనందరికీ తెలుసు. ఈ సూత్రం గుండెకి కూడా వర్తిస్తుంది. హెల్తీ హార్ట్ కావాలంటే అందుకు తగిన లైఫ్‌స్టైల్‌ని ఎంచుకోవాలి. ఈ మధ్యకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనే ఆరోగ్య సమస్యలకి డైలీ లైఫ్ ఫాలో అవుతున్న ఛాయిస్ వల్లే అని నిపుణుల అభిప్రాయం. ఆరోగ్యకరం కాని ఆహారం తీసుకోవడం, పోషకాలే లేని షుగర్ ఎక్కువగా ఉన్న ఫుడ్ తీసుకోవడం, ఫిజికల్ యాక్టివిటీ లేని లైఫ్ స్టైల్, ఒత్తిడి, స్మోకింగ్ లాంటివి గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి. ఈ మధ్యే జరిగిన ఒక సర్వే ప్రకారం మన లైఫ్ స్టైల్ లో మార్పులు చేసుకోవడం ద్వారా గుండె జబ్బుల బారిన పడే ముప్పుని యాభై శాతం తగ్గించుకోవచ్చని తెలుస్తోంది.తాజా కూరగాయలూ, తక్కువ ఉప్పూ, నూనె తో వండే ఆహారాన్నే ఆరోగ్యకరమైన ఆహారం అంటారు. బయట తినడం తగ్గించేశాం కాబట్టి ఇంట్లో వంట ఈ పద్దతిలో చేసుకోవడం తేలిక. మీరు తీసుకునే ధాన్యాల్లో కనీసం సగమైనా హోల్ గ్రెయిన్స్ ఉండాలి. మిల్లెట్స్, బ్రౌన్ రైస్, మల్టీ గ్రెయిన్ ఫ్లోర్ లో వండిన పదార్ధాలు రెండు సార్లైనా తీసుకోవాలి.. పప్పులు, గింజలు, నట్స్ నుండి వచ్చే ప్లాంట్ బేస్డ్ ప్రోటీన్ కి ఇంపార్టెన్స్ ఇవ్వండి. రాజ్మా, శనగలు వంటి వాటిలో గుండె ఆరోగ్యానికి సహకరించే మినరల్స్, ఫైటో న్యూట్రియెంట్స్‌తో పాటూ పీచు పదార్ధం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇవి తిన్నాక కడుపు నిండుగా అనిపించి బింజ్-ఈటింగ్ నుండి దూరంగా ఉంటాం. ప్రోటీన్ ఇమ్యూన్ సిస్టమ్‌ని కూడా బలంగా ఉ ంచుతుంది. ప్రతి భోజనం లోనూ ప్రోటీన్ ఉండేటట్లు చూసుకోండి. పప్పులు కాక తక్కువ నూనె తో వండిన ఎగ్స్, చికెన్ బ్రెస్ట్, ఫిష్ లో కూడా మంచి ప్రోటీన్ లభిస్తుంది. వేరు శనగ నూనె, సన్ ఫ్లవర్ ఆయిల్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హెల్దీ ఆయిల్స్ ని ఎంచుకోండి. ప్రతి రెండు నెలలకీ వెరైటీ మార్చండి. ప్లాంట్ బేస్డ్ ఆయిల్స్ లో గుండె ని కాపాడే మోనో అన్ శాచురేటెడ్, పాలీ అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి, శాచురేటెడ్ ఫ్యాట్స్ చాలా తక్కువగా ఉంటాయి. రోజుకి ఒక వ్యక్తి ఐదు లేదా ఆరు టీ స్పూన్ల కంటే ఎక్కువ ఆయిల్ తీసుకోకూడదు.

## లెజెండ్

# పురుచ్చితలైవి



ఒక రాష్ట్ర రాజకీయాలను కంటి చూపుతోనే శాసించిన అతి కొద్ది మంది రాజకీయ నేతల్లో జయ లలిత ఒకరు. తమిళనాడు రాష్ట్రా నికి ఆరు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. సినీ నటిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. అన్నాడీఎంకే అధినేత్రిగా.. తమిళనాడు సీఎంగా ఎదిగిన తీరు నిజంగా అద్భుతం. 1991 నుంచి 2016 మధ్య ఆమె 14 ఏళ్లపాటు ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేశారు.1948 ఫిబ్రవరి 24న కర్ణాటకలోని మండ్య జిల్లా పాండవపుర తాలూకా లోని మెల్కోటేలో.. తమి ళ అయ్యంగార్ కుటుంబంలో జన్మించారు. జయలలిత తల్లి వేదవల్లి, తండ్రి జయరాం. జయరాం లాయరుగా పని చేసే వారు. అయ్యంగార్ల సంప్రదాయం ప్రకారం తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన రెండు పేర్లు కోమలవల్లి, జయలలిత. ఆమె తాత నరసిం హన్ రంగాచార్యులు.. మైసూరు మహారాజా సంస్థానంలో ఆస్థాన వైద్యునిగా ఉండేవారు. జయలలిత జన్మించిన రెండేళ్లకే ఆమె తండ్రి చని పోయారు. దీంతో ఆమె కుటుంబం బెంగుళూరులోని అమ్మమ్మ గారింటికి చేరారు. తల్లి వేదవల్లి బెంగుళూరులో చిన్న ఉద్యోగంలో చేరారు.

జయలలిత చాలా చురుకైన విద్యార్థిని. చదువులోనే కాకుండా ఆటపాటల్లోనూ ఆమె ముందుండే వారు. ప్రాథమిక విద్యను బెంగుళూ రు బిషప్ కాటన్ బాలికల పాఠశాల లో పూర్తి చేశారు. మద్రాసు చర్చ్ పార్క్ కాన్వెంట్‌లోను కొనసాగిం చిన జయలలిత మెట్రిక్యులేషన్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచారు. చదువు కుంటూనే సంప్రదాయ భరత నాట్యం తో పాటు మోహినీ యాట్టం, మణిపురి, కథక్ వంటి నృత్య రీతులను జయలలిత నేర్చు కున్నారు. సంప్రదాయ కర్నాటక సంగీతం కూడా అభ్యసించారు.

మద్రాస్‌లో రంగస్థల నటిగా స్థిరపడ్డ సోదరి అంబుజవల్లి వద్ద ఉంటూ.. సినిమాలో నటించాలనే ప్రబలమైన కోరికతో, అవకాశాల కోసం ప్రయత్నించారు. సంధ్య అనే పేరుతో తన ప్రస్థానాన్ని నాటకాల తో ప్రారంభించి.. అశించిన విధంగా సినీ నటి స్థాయికి ఎదిగారు.

జయలలిత 1961 లో కన్నడ సినిమా "శ్రీ శైల మహాత్మే" తో సినీ రంగ ప్రవేశం చేశారు. బాలనటిగా అడుగు పెట్టారు. 1965 లో సీ.వీ. శ్రీధర్ దర్శకత్వం వహించిన "వెన్నీ రాదై"తో తమిళ చిత్ర సీమలో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత ఎమ్.జీ. రామచంద్రన్ (ఎమ్‌జీఆర్) సరసన 28 సినిమాలు, శివాజీ గణే షన్‌తో 17 సినిమాలలో నటించా రు. నటనలో ప్రతిభ కనబరిచి నందుకు ఆమె ఎన్నో అవార్డులను సాధించారు. జయలలిత తమిళం తో పాటు తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లా డే వారు. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 140 సిని మాల్లో జయలలిత నటించారు. ఆమె నటించిన ఏకైక హిందీ సినిమా ఇజ్జత్.

జయలలిత ...కథానాయకుని కథ (1965), మనుషులు మమతలు (1965), ఆమె ఎవరు? (1966), ఆస్తిపరులు (1966), కన్నెపిల్ల (1966), గూఢచారి 116 (1966), నవరాత్రి (1966), గోపాలుడు భూపాలుడు (1967), చిక్కడు దొరకడు (1967), ధనమే ప్రపంచ లీల (1967), నువ్వే (1967), బ్రహ్మచారి (1967), సుఖ దుఃఖాలు (1967), అదృష్టవంతులు (1968), కోయంబత్తూరు ఖైదీ (1968),తిక్క శంకరయ్య (1968), దోపిడీ దొంగలు (1968), నిలువు దోపిడి (1968), పూలపిల్ల (1968), పెళ్ళంటే భయం (1968), పోస్టు మన్ రాజు (1968), బ్లాద్ గజ దొంగ (1968), శ్రీరామకథ (1968), ఆదర్శ కుటుంబం (1969), కథా నాయకుడు (1969), కదలడు వదలడు (1969), కొండవీటి సింహం (1969), పంచ కళ్యాణి దొంగల రాణి (1969), ఆలీ బాబా 40 దొంగలు (1970), కోటీశ్వరుడు (1970), గండికోట రహస్యం (1970), మేమే మొనగాళ్లం (1971), శ్రీకృష్ణ విజయం (1971), శ్రీకృష్ణసత్య (1971), భార్యా బిడ్డ లు (1972), డాక్టర్ బాబు (1973), దేవుడమ్మ (1973), దేవుడు చేసిన మనుషులు (1973), లోకం చుట్టిన వీరుడు (1973), ప్రేములు - పెళ్ళి ళ్ళు (1974), నాయకుడు %--% వినా యకుడు (1980) తదితర తెలుగు చిత్రాలలో విభిన్న పాత్రలలో జయలలిత నటించారు.

ఎం. జీ. రామచంద్రన్ స్థాపించిన ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐడీఎంకే) లో చేరడం ద్వారా ఆమె తన రాజ కీయాల్లోకి అడుగు పెట్టారు. ఎంజీఆర్ కు సన్నిహితురాలిగా ఉంటూ 1984 నుంచి 1989 మధ్య రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. 1987 లో ఎమ్‌జీఆర్ మరణానంతరం 1989 లో ఏఐడీఎంకే అధినేత్రి అయ్యారు. 1991 లో పార్టీని అధికారం లోకి తెచ్చి, తమిళనాడులో మొత్తం పదవీకాలం పూర్తిచేసిన మొదటి మహిళా ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. తమిళనాట రాజకీ యాల్లో క్రియాశీలకంగా వ్యవహ రించి 'పురుచ్చి తలైవి' (విప్లవ నాయకురాలు)గా పేరు గాంచిన జయలలిత 43 ఏళ్లకే ఆమె ముఖ్యమంత్రి అయి, అత్యంత పిన్న వయసులోనే తమిళనాడు సీఎంగా ఎన్నికైన వ్యక్తిగా ఆమె రికార్డు నెలకొల్పారు. ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు కూడా వెళ్లారు. అనారోగ్యం కారణంగా 75 రోజులు మృత్యు వుతో పోరాడిన తర్వాత డిసెంబరు 6, 2016 న ఆమె కన్ను మూశారు. ఆమె మరణం ఎన్నో వివాదాలకు నెలవైంది.

74 రోజులపాటు అపోలో హాస్పిట ల్‌లో చికిత్స పొంది ప్రాణాలు వద లిన జయలలిత జీవితం ఆధారంగా బాయోపిక్స్ వస్తున్నాయి

## నవ కవిత్వం

# పువ్వులా క్షణమైనా..!



చెట్టు ధర్మం పరహితం
పువ్వు తల్లి మహావృక్షమే
అంగాంగం త్యాగ గుణం
పువ్వంటే ఉప్పొంగే దైవ భావం
వేద వృక్షాన్ని పోషిస్తేనే కదా..
ధర్మమనే పువ్వు వికసించేది
పుష్ప సంరక్షణే బ్రహ్మ జ్ఞానఫలం
అందుకేనేమో కదా..
పువ్వు దోచును అందరి మనసుల్ని
మొగ్గ తొడిగి క్షణమైనా ఆగక..
సుగంధ పరిమళాల్ని..
పరులకు పంచేందుకు..
దేవుడి మెడలో చేరేందుకు..
మనసుల్ని రంజింపజేసేందుకు..
కీటకాల్ని ఆహ్వానించేందుకు..
పసందైన తేనెను పంచేందుకు..
ఫలదీకరణానికి
దోహదపడేందుకు..
మొగ్గ, కాయ, పండై..
నీ, నా, మన పొట్టల్ని నింపేందుకు
!చేయి తడిపితేనే చేతలు
పక్కోడి కష్టం నాకు అక్కర్లేదు
పరిమళ మంచిని పంచేది లేదు
నలుగురికి నవ్వులు పంచేది లేదు
తపనపడే యోచన ఏకోశాన లేదు
దైవ కార్యానికి అక్కరకొచ్చేది లేదు
తల్లి, చెల్లి సంతోష సిగలో చేరేది
లేదు !
పువ్వుకు, నరుడికి..
జమీన్ ఆస్మాన్ ఫరక్
నవీన నరుడెన్నటికీ..
పరహిత పువ్వులా
వికసించలేడా..?
త్యాగానికి ప్రతీకలు సుగంధ
పువ్వులు
స్వార్థానికి నిలువెత్తు సాక్షులు
నరులే
పువ్వులా కొన్ని క్షణాలైనా..
పంచుదాం సేవా సుగంధ
పరిమళాల్ని..
నిర్వచిద్దాం వందేళ్ల జీవిత
పరమార్థాన్ని !

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**- 9949700037**




**ముఖపత్ర కథనం బాగుంది**

ఆదివారం అనుబంధంలోఈ ఆదివారం అనుబందంలో పద్మశ్రీ గ్రహీత చింతకింది మల్లేశం గురించి సవివరణగా ఇచ్చారు. మల్లేశం సినిమాకు అతనే స్ఫూర్తి అని తెలిసాక ఆశ్చర్యం కలిగింది. మంచి వ్యాసం ప్రచురించిన మీకు ఎడిటోరియల్ టీమ్‌కు రచయితకు ధన్యవాదాలు. సందర్భోచిత వ్యాసాలు అందించడంలో సూర్య మరోమారు ప్రత్యేకత నిలపు కుంది. రచయితకు, యాజమా న్యానికి, ప్రచురణకర్తలకు మిక్కిలి కృతజ్ఞతలు.

**- చిత్తారపు సత్యనారాయణ, గూడూరు,**

**పెంకి చంద్రజీవన్, శ్రీకాకుళం**

**సినిమా రివ్యూలు**

ఇటీవల కొంత కాలంగా ఓట టి ఇతర డిజిటల్ వేదికపై విడుదవుతున్న చిత్రాల తీరు తెన్నుల ను విశ్లేషిస్తు రివ్యూలు ఈ వారం నుంచి వ న్సా_ య ౦ ని ఆశిస్తున్నా... నాటి అజ రామర చిత్రాలెంత గొప్పవో భావిత రాకు అందించే ప్రయత్నం మరో మారు ఆరంభించండి. సినిమా బిట్స కూడా ప్రచురించండి. బాగుంటుంది

**- ఆపాటి శ్యామసుందర బెనర్జీ, విజయనగరం**

**- రామనగరం రమాప్రభ, విశాఖపట్నం**

## బుడతడు బాగున్నాడు

ఈ వారం బుడత పేజిలో ఇచ్చిన కథలు చిన్న వారిపూ కాదు పెద్దలనీ ఆకట్టు కునేలా ఉంది. మీకు ధన్యవాదాలు

**- భాగ్య ప్రకాశరావు, చిత్తూరు**

**ఆధ్యాత్మికం బాగుంది**

నెయ్యిపోస్తే వెన్నగా మారే శివలింగం గురించి అద్భుత విశ్లేషణ అందించారు. భారతావనిలో ఉన్న ఇలాంటి వింతలగురించి మరిన్ని చెప్పండి

**- నవిరి రమాభారతి, కెపిహెచ్‌బి**

## క్రొత్త సంవత్సరంలో
# ఏమి క్రొత్తగా కనిపిస్తోంది

అవే మనస్తత్వాలు
ద్వేషంతో నిండిన అంతరంగాలు
ప్రక్కవాడిపై కత్తిగట్టిన కుతంత్రాలు
విడిపోతున్న కుటుంబాలు
తెగిపోతున్న బంధాలు అనుబంధాలు
శాంతి లేని జీవితాలు
క్రొత్త సంవత్సరంలో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది

అదే రాజకీయ భ్రష్టత్వం
అవే శుష్క వాగ్దానాలు
అవే ఓటు బ్యాంకు రాజకీయాలు
అవే ధనవంతుల అకృత్యాలు
అవే పేదవాళ్ల ఇక్కట్లు
క్రొత్త సంవత్సరంలో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది


అదే యుద్ధ ఉన్మాదం
అదే రక్తం దాహం
అదే బలవంతుల క్రూరత్వం
అదే బలహీనుని దుర్బలత్వం
అవే వేదికలపై అసందర్భ వాచాలత్వః
క్రొత్త సంవత్సరంలో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది
అవే టి.వి చానళ్లు
అవే డబ్బు దండుకునే ప్రకటనలు
అవే సెలబ్రిటీల జీవిత చరిత్రలు
అవే న్యూస్ పేపర్లు
అవే మహిళలపై అత్యాచారాల వార్తలు
క్రొత్త సంవత్సరం లో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది

అవే పేదలపాట్లు
అవే కష్టాలు కన్నీళ్లు
అవే రేషన్ దుకాణాలు
అదే ఒకటి దొరికితే ఒకటి దొరకని
కొరత
అదే బ్లాక్ మార్కెటింగ్
అదే కల్తీ
అదే కరోనా కష్టం సమయంలో
అదే ఆసుపత్రుల దోపిడీ
క్రొత్త సంవత్సరం లో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది

అవే ప్రభుత్వ సారాయి దుకాణాలు
అవే మందుబాబుల క్యూలు
అవే తప్పతాగి భార్యలపై అకృత్యాలు
అవే కుటుంబాలు రోడ్డున పడడం
క్రొత్త సంవత్సరంలో ఏమి క్రొత్తగా
కనిపిస్తోంది

అదే స్వార్థం
అదే స్వగతం
అదే చింత నేను నాది
అదే ఆలోచన ఎదుటివారు
బాగుపడకూడదు
అదే భాధ ఉన్నవాడికి తింటే అరగదు
అదే వ్యధ లేనివాడికి తిండి దొరకదు
ఇదే నా పవిత్ర భారత ముఖచిత్రం
క్రొత్త సంవత్సరంలో ఏమి మారింది
మార్పు నీలో రావాలి
మార్పు నాలో రావాలి
మార్పు వ్యవస్థలో రావాలి
పుడే క్రొత్త సంవత్సరంలో నూతనత్వం

**అరుణ డేనియల్**
**9000606889**



# ఈ యోగాసనాలు కీళ్ల నొప్పులను బాగా తగ్గిస్తాయి

చలికాలంలో కీళ్ల నొప్పులు రావడం చాలా కామన్. చాలా మందికి తెలయదు కానీ కొన్ని యోగాసనాలు ఈ నొప్పిని తగ్గించడంలో బాగా ఉపయోగపడతాయి.

వయసు పెరిగే కొద్దీ కీళ్ల నొప్పులు వచ్చే అవకాశాలు బాగా పెరుగుతాయి. ఎముకలు బలహీనపడటం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, శరీరానికి అవసరమైన పోషకాలు ఆహారంలో లేకపోవడం వల్ల ఈ నొప్పులు వచ్చే అవకాశం మరింత పెరుగుతుంది. కొన్ని మందులు ఈ నొప్పిని తగ్గించడానికి సహాయపడతాయి. అంతేకాదు కొన్ని యోగాసనాలు కూడా కీళ్ల నొప్పులను తగ్గించడానికి సహాయపడతాయి. కీళ్ల నొప్పులు, దృఢత్వం వల్ల నడవడం, కూర్చోవడం, పడుకోవడం కూడా కష్టంగానే ఉంటుంది. అంతేకాదు ఈ కీళ్ల నొప్పులు వారి రోజువారీ కార్యకలాపాలకు కూడా అంతరాయం కలిగిస్తాయి. ఏయే యోగాసనాలు కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**1. వీరభద్రసానం:** ఈ భంగిమ మీ చేతులు, భుజాలు, తొడలు, వెనుక కండరాలను ఒకేసారి బలోపేతం చేస్తుంది. ఈ యోగాసనం ప్రయోజనాలు.. ఈ యోగాసనం చేతులు, కాళ్ళు, దిగువ వీపును బలోపేతం చేస్తుంది. శరీరంలో సమతుల్యతను మెరుగుపరుస్తుంది. అలాగే శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఇది భుజాలను బలోపేతం చేస్తుంది.

చాలా తక్కువ సమయంలో భుజాలపై ఒత్తిడిని పెంచుతుంది.
ఈ భంగిమ ధైర్యం, దయ, ప్రశాంతతను పెంచుతుంది.

**2. సేతు బంధాసనం :** దీనినే బ్రిడ్జ్ భంగిమ అని కూడా



అంటారు. ఇది మోకాలి కీలులోని కండరాలను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. బోలు ఎముకల వ్యాధితో బాధపడుతున్న వారికి ఇది బాగా సహాయపడుతుంది. ఇది మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. ఈ భంగిమ శరీరంలో ఆందోళన, ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

ప్రయోజనాలు: ఈ భంగిమ వెన్ను కండరాలను బలోపేతం చేస్తుంది. వీపు అలసట నుంచి తక్షణమే ఉపశమనం కలిగిస్తుంది. ఛాతీ, మెడ, వెన్నెముకకు చక్కటి మసాజ్ లా పనిచేస్తుంది. ఇది మెదడు ప్రశాంతంగా ఉంచుతుంది. ఆందోళన, ఒత్తిడి, నిరాశను తగ్గిస్తుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుస్తుంది. థైరాయిడ్ సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుంది రుతువిరతి, ఋతుస్రావం నొప్పి లక్షణాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఉబ్బసం, అధిక రక్తపోటు, బోలు ఎముకల వ్యాధి, సైనసిటిస్ వంటి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

**3. ధనురాసనం :**


ఈ భంగిమ భుజాలను నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఈ యోగా భంగిమ వీపు నొప్పిని తగ్గిస్తుంది. శరీరం ఒత్తిడి, అలసట నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

ప్రయోజనాలు : ఇది వెన్ను, పొత్తికడుపు కండరాలను బలోపేతం చేస్తుంది. పునరుత్పత్తి అవయవాలను ఉత్తేజపరుస్తుంది. ఛాతీ, మెడ, భుజాల కండరాలను బలంగా చేస్తుంది కాలు, చేతి కండరాలను టోన్ చేస్తుంది. ఒత్తిడి, అలసటను తగ్గిస్తుంది

పీరియడ్స్ అసౌకర్యం, మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
మూత్రపిండాల సమస్యలున్నవారికి ఇది సహాయపడుతుంది



# సూర్య బుడత





## నక్క సమయస్ఫూర్తి

ఒక నక్క ప్రమాదవశాత్తు ఒక ముళ్ళ పొదలో చిక్కుకుపోయింది. అది ఎంతగా పెనుగులాడినా బయటకు రాలేకపోయింది. దాని తోక చివరి భాగం ముళ్ళ కంచె మధ్యలో ఇరుక్కు పోయింది. ముళ్ళపొద దట్టంగా ఉండటం దానిలో వివిధ రకాల చీమలు, దోమలు, విషకీటకాలు ఉన్నాయి. నక్క ముళ్ళలో ఇరుక్కు పోవడం గమనించిన దోమల గుంపు దానిపై తమ తడాఖా చూపెట్టాయి. దాంతో నక్క శరీరమంతా విపరీతంగా దద్దులు వచ్చి రక్తం కారడం మొదలయ్యింది. తన రక్తం తాగుతున్న దోమలను నక్క ఏమీ చేయలేక నీరసపడి పోయి, సహాయం కోసం వేచి చూస్తోంది.
అదే సమయంలో అటుగా వస్తున్న ముళ్ళపందిని నక్క తనను దోమల బారి నుండి కాపాడమని బతిమాలింది. ముళ్ళపంది ముళ్ళను తొలగించి,నక్కను కాపాడింది. ముళ్ళపందికి కృతజ్ఞతలు చెప్పిన నక్క దోమల గుంపును మాత్రం కదిలించవద్దని ప్రాధేయపడింది.
దోమల గుంపును ఎందుకు కదిలించవద్దని ముళ్ళపంది అడిగితే, నన్ను కరిచి అవి ఇప్పటి వరకు ఎంతో రక్తాన్ని తాగాయి. వాటిని గనుక వెంటాడితే ఇప్పుడు మరో దోమల గుంపు వచ్చి నా మిగిలిన రక్తాన్ని కూడా తాగుతాయి అని అన్నది నక్క. నక్క సమయస్ఫూర్తికి, దూరాలోచనకి ముగ్ధురాలైన ముళ్ళపంది సరేనని అక్కడి నుండి వెళ్ళిపోయింది.

## గుర్తించండి

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| T | L | U | N | D | E | R | D | O | S |
| B | O | A | E | I | C | E | I | S | E |
| U | L | O | M | T | L | Y | E | E | I |
| T | H | E | F | P | H | L | T | N | G |
| E | L | I | M | R | E | G | O | I | H |
| A | S | A | L | T | E | T | I | H | C |
| R | R | I | S | L | H | D | O | S | T |
| T | Y | A | A | I | T | G | N | O | U |
| H | T | I | N | R | O | O | I | U | F |
| B | U | G | C | U | P | I | P | L | E |

SALT
EARTH
TASTELESS
NOTHING
TRAMPLED
CITY
LIGHT
UNDERFOOT
HILLTOP
LAMP
TUB
SHINES
SIGHT
MEN
PRAISE



## దారి చూపండి



### మంచి పద్యం - నేర్చుకుందాం

*వినదగు నెవ్వరు చెప్పిన*
*వినినంతనె వేగపడక వివరింపదగున్*
*కనికల్ల నిజము తెలిసిన*
*మనుజుడెపో, నీతిపరుడు మహిలో సుమతీ!*

**భావనలు:** సుమతీ! మంచి బుద్ధి కలవాడా! ఎవ్వరైనా, ఏదైనా మంచి మాట చెబితే శ్రద్ధగా విను. ఇతరులు చెప్తే వినేదేమిటి? అని అహంకరించకూడదు. విన్న వెంటనే తొందరపడి చేయకూడదు. నీ స్వబుద్ధితో ఆలోచించి, నిజానిజాలు తెల్సుకొని, అది తగిన పని అనుకుంటేనే చేయబూనటం నీతిపరుల లక్షణం.

## చుక్కలు కలపండి





## రంగులు వేయండి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | 7 | |
| | | | | 5 | | 8 | | 1 |
| | | 6 | 4 | 1 | | | 3 | 5 |
| 6 | | 7 | | | | 5 | 2 | |
| | | | 2 | | 9 | | | |
| | 4 | 1 | | | | 6 | | 9 |
| 9 | 7 | | | 2 | 1 | 4 | | |
| 1 | | 5 | | 3 | | | | |
| | 8 | | | | | | | |

# తప్పేం కాదు ( గల్పిక)



'ఈ ' పార్టీ అధినేత డబ్బారావు నాలుక కొరుక్కున్నాడు. ఎన్నికల ప్రచారం కీలక ఘట్టం లో ఇలాంటి తప్పు చేస్తానని కలలో కూడా అనుకోలేదు. ఈ దెబ్బతో తన ఫేం, ఫాం,గెలుపు అవకాశాలు ఢాం అంటాయేమోనని ఒక్కటే గుబులై పోతుంది. ఎక్కడా ' ఆ ' పార్టీ దిబ్బారావు కన్నా వెనుక బడకూడదని ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. దొంగలు పడ్డ ఆరు మాసాలకు కుక్కలు మొరిగినట్లు కాకుండా, ఎన్నికల షెడ్యూల్ కి ఆరు మాసాలు ముందుగానే బూతులు లంకించుకున్నాడు. తన పార్టీ లో చిన్న కార్యకర్త కూడా బూతుల్లో నిరక్షరాస్యుడి గా మిగిలిపోకుండా ప్రత్యేక కోచింగ్ సెంటర్లు తెరిచి ఆ పైశాచిక భాషా ప్రవీణులుగా తీర్చిదిద్దాడు. గెలవాలంటే కొంతకాలం పాటు మర్యాదస్తుల భాషని, నలిగిపోయిన బట్టల్ని వదిలేసి నట్టు వదిలేయాలని నూరి పోశాడు. ఎవరైనా ఎక్కడైనా పొరపాటున మామూలు భాష మాట్లాడితే వెంటనే తనకి రిపోర్ట్ వచ్చేలా వేగుల టీమ్ లు ఏర్పాటు చేసుకున్నాడు.

ఎన్నికలయ్యే దాకా నిజం చెప్పనని శకుని మీద ఒట్టేసుకున్నాడు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్న తను ఇలా పెద్ద తప్పు చేసినందుకు ఇంకా గాఢమైన భాషలో తిట్టు కున్నాడు.

ప్రచారం నుండి వస్తూనే ఇంట్లో సోఫాలో కూలబడ్డాడు.

" ఏమండీ. కాఫీ మింగుతారా?" శ్రీమతి ప్రేమ నిండిన గొంతు తో కరుగ్గా అడిగింది.

"నీ పని నువ్వు చూస్కో. నన్ను కెలక్కు. తర్వాత వస్తాలే. పో." అంతే ప్రేమగా బదులిచ్చాడు.

ఈ లోగా కూతురు వచ్చి " ఓ దిగబడ్డావా నాన్నా. అప్పుడే రావేమో అనుకున్నాను. ఆ గదిలో నీయబ్బ చూడు ఎందుకో ఊరికే నవ్వు కుంటున్నాడు."

" తాతయ్య అన్లేవా,సర్లే పో."

చేతులు నులుముకుంటూ వచ్చిన సెక్రెటరీ మౌనం గా నిలబడ్డాడు.

డబ్బారావు గుర్రుగా చూశాడు ' ఇదంతా నీవల్లే అన్న అర్థం' తో. సెక్రెటరీ వెర్రి చూపులు చూశాడు ' నీ మూగ భాష నాకేం అర్థం కాలేదు' అన్నట్టుగా.

ఇంక లాభం లేదని నోరు తెరిచి "ఇదంతా నీవల్లే అయ్యింది. నువ్వు అన్నీ చూసుకోవాలి కదా"

" ఏమైంది సార్. మీటింగ్ బాగా జరిగింది. అందరికీ బిర్యాని పొట్లాలు అందాయి. అందరూ హ్యాపీ యే కదా"

"వాళ్ళు హ్యాపీ కావొచ్చు. మన జనాలే కాబట్టి. ఇపుడు సోషల్ మీడియా,రేపు ప్రింట్ మీడియా,ఎల్లుండి ' ఆ ' పార్టీ మనల్ని చెడుగుడు ఆడదా? మనం జనం దృష్టిలో ఫూల్స్ అయి ఓడిపోమా?"

"అసలేమైంది సార్. నాకేమీ తెలియడం లేదు."

డబ్బారావు గందరగోళం లో పడ్డాడు

'వార్నీ. వీడికింకా జరిగిన తప్పు కూడా తెలియలేదన్నమాట. వీడికి చెప్పి లాభం లేదు. నా బాధేదో నేనే పడడం బెస్ట్ ' అనుకున్నాడు.

వాట్స్ అప్ తెరిచాడు. సకల బూతులు ప్రవహిస్తున్నాయి. కానీ తన ' తప్పు ' గురించి ఏమీ లేదు.' ఏంటీ. ఒక ట్రోల్ కి కూడా కొరగాకుండా పోయానా ' అని కాసేపు మథనపడి 'జరిగింది మంచికేలే 'అని సమాధాన పడ్డాడు.

యూ ట్యూబ్ లో అదే ధోరణి. జనరల్ గా బూతులు తప్పితే ప్రత్యేకించి ప్రస్తావన లేదు. రాత్రంతా కునుకులేకుండా కూర్చుని వాట్సాప్, ట్విట్టర్, యూట్యూబ్ మార్చి మార్చి చూశాడు.

మరునాడు పేపర్ లో అదే ధోరణి. చిన్న తప్పునైనా పట్టుకుని,దాన్ని పెంచి పెద్దది చేసి,పీకి పాకం పట్టే ఎగస్పార్టీ కూడా మౌనమే.

డబ్బా రావు కి భయం తగ్గిపోయి,క్యూరియాసిటి ఎక్కువైంది.. ఈ నగరానికి ఏమైంది తరహాలో.

****. *****. ****

శ్రీమతి ఉదయాన్నే కాఫీ తెచ్చి ' అఘోరించండి ' అని చేతిలో పెట్టి పక్కన కూర్చుంది.

" చూశావోయ్. నిన్న అంత పెద్ద తప్పు చేశానా,ఎవడూ పట్టించుకోలేదు . అదే అర్థం కావడం లేదు. భయపడి చచ్చాననుకో "

" ఏం చేసి తగలడ్డారండి. అంత పెద్ద తప్పు. కొంపదీసి నిజాలు చెప్పేసారేంటి?"

" ఛ ఛ ఎందుకలా చేస్తాను. నిన్న నా ప్రసంగం అంతా చూశావు కదా."

" చూశాను. అంతా మామూలే కదా. మొదటి అరగంటా బూతులు,తర్వాత తిట్లు, శాపనార్థాలు చివర్లో మీ గొప్పలు."

" అయితే నువ్వు గమనించ లేదన్న మాట. నేను పొరపాటున ఎగస్పార్టి ' ఆ ' పార్టీ మానిఫెస్టో చదివేశాను. తర్వాత చూసుకున్నాను."

" అదెలా అఘోరించారు?"

" మనదీ, వారిదీ రెండూ పట్టుకున్నాను. వారి దానిది పై పేజీ చిరిగి ఉండడం వల్ల మనదే అనుకున్నాను. చదివేశాను. అయినా ఎవడూ గుర్తుపట్టలేదేం?"

" ఏం తేడా ఏడ్చి చచ్చింది. రెండూ ఒకే కాపీలా ఉంటేను"

" పుసుక్కున అలా అనేశావేం? వాళ్ళు ఇస్తామన్న దానికి ఓ పదో,ముప్పయ్యో ఎక్కువేసి ఇస్తానని హామీలు రాశాను కదా!"

" ఆ సొదలన్నీ ఎవడు వింటాడు. ఏదో మర్యాదకి వింటున్నట్టు నటిస్తాడు కానీ" అంటూ తేల్చేసింది.

" అది కాదోయ్. వినే వాడు ఒక్కడైనా తేడా చూడకపోయి ఉంటాడా?" డబ్బా రావు మాట పూర్తి కాకుండానే ఆయన్ని గుంజి మామగారున్న గదికి తీసుకెళ్ళింది.' ఇదుగోండి మీకు ఆన్సర్ ఇక్కడ దొరుకుతుంది ' అన్నట్టు.

ఎప్పుడూ విచారం గా, డల్ గా ఉండే ఆయన చేతిలో పుస్తకం చదువుతూ పగలబడి నవ్వు తున్నాడు. కోడల్ని చూసి చెప్తూ ' మాంచి కామెడీ పుస్తకం ఇచ్చావమ్మా. భలేగుంది.' అంటూ.

అది ' ఈ ' పార్టీ మ్యానిఫెస్టో.

లిలిలిలిలి. లిలిలిలిలి లిలిలిలిలి

ఉప సంహారం: డబ్బా రావు బహిరంగంగా చేసిన తప్పు అలా బయటపడకుండానే ఉండి పోయింది. చచ్చినా ఎవరికీ తెలియ లేదు. చెప్పడం వల్ల శ్రీమతి కి తప్పు. పై పేజీ చింపింది తన కూతురు.. కాగితప్పడవ చేసుకోడానికి.

**సమాప్తం**


**డా.డి.వి.జి. శంకరరావు,మాజీ ఎంపీ.**
**9440836931**

**పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :**

**suryaeditpage@gmail.com**

**SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.**

# నృత్యంలో కీలకం ఈ కరణాలు




ఈ విధంగా నాట్యాన్ని ప్రదర్శించేవేళలో కరణాన్ని వాడే సందర్భంలో ముఖ్యంగా గతి, అవస్థ అనే రెండు తేడాలు స్పష్టమవుతాయి. గతి అంటే శరీరాన్ని కదిలించడం, అవస్థ అంటే స్థిరంగా ఉండడం అని అర్థం. అవస్థానం అనే ప్రయోగానికి వైష్ణవ- మండలాది స్థానకాలు బాగా ఉపయోగపడతాయి. ఇక గతి ప్రయోగంలో చారులు అనేవి ఉపయోగ పడతాయి. అయితే ఈ రెండు అవస్థల్లోనూ చేతుల్ని కదలించడం తప్పని సరనేది మరచిపోకూడదు. చారుల విషయాని కొస్తే ఇది కేవలం పాదాల్ని కదిలించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. అలాగే గతి ప్రయో గంలో శరీరంలోని పైభాగానికి సంబంధించిన చేతులు, కంటి చూ(తూ)పులు నాట్యాన్ని రసకందా యంలోకి తీసుకొచ్చేందుకు బాగా పని కొస్తాయి. పతాకం (ధ్వజం, జెండా) తదితర అభినయాది విశేషాల్లో మాత్రం చేతులు స్థితి ప్రయోగంలోనే ఉపయోగంలోకి వస్తాయి. ఈ విధంగా స్థితి, గతి సమ్మేళణం వల్లనే కరణాలు రెట్టింపు అవుతాయి. అయితే భరతముని మాత్రం ఎందుకో అంగహారా లందు ఉపయోగపడే కరణాలను మాత్రమే వివరించాడు.

ఇప్పుడు అంగహారమనే కొత్త మాట వినిపిస్తోంది కదూ! ఇది మామూలు వాళ్లకు పరి చయం లేకపోవచ్చునేమో గానీ నటీ మణులకు, నాయకులకు బాగా తెలుసున్నదే. అంగహారం అంటే అంగవిక్షేపం అంటోంది అమరకోశం. అంటే నాట్య విన్యాసాన్ని మరింత రక్తి కట్టించేందుకు అనువుగా శరీరంలోని ఒక భాగాన్ని ఒక చోటు నుంచి మరో చోటుకు అందంగా కదలించడమే అంగ విక్షేపం అని అభినవగుప్తుడు నిర్వచనం చెప్పాడు.

కాబట్టి నాట్యానికి నిజంగా కరణమే మాతృక అయినప్పటికీ ఇటువంటి అనేక కరణాల సమ్మేళ ణంతో కూడిన అంగహారాలతో పుట్టిందే నాట్యం అవుతుంది.

అలా ఒకసారి హస్త పాదాభినయం నాట్యాన్ని ప్రారంభించి అనంతరం అదే నృత్యంలో మరో కొత్తకోణాన్ని ఆవిష్కరించేటప్పుడు ప్రారంభానికి ఆటంకం కలగకుండా తన శిష్యుడు (రాలు) చేత ఆ కోణాన్ని అభినయించేలా చూసుకోవడంలోనే నాట్యాచార్యుని ప్రతిభా పాటవాలు ప్రస్ఫుటమవు తాయి. అయితే భరతముని మాత్రం కరణాలను ఎలా వినియోగించాలో చెప్పలేదు

కానీ, అభినవగుప్తుడు మాత్రం చాలా కరణాలను, వాటికి తగిన ఉదాహరణలతో కూడా చెప్పాడు. అయినా అవి ఎక్కడో పండితులకు తప్ప సామాన్యులకు అర్థమయ్యేలా ఉండకపోవడంతో వాటిల్ని ఈ విధంగా వాడాలంటూ జాయసేనాపతి చక్కగా వివరించాడు.



దాని ప్రకారం ఈ కరణాలు కొన్నేమో మానసిక భావాలను తెలిపేందుకు ఉపయోగ పడతాయని, మరికొన్ని మానసిక, శారీరక భావాల సమ్మేళణాన్ని తెలియచేస్తాయని అర్థం అవుతుంది. ఇంకా కొన్ని పెద్దపెద్ద (గరుడపక్షి) పక్షులు, క్రూర (సింహ) జంతువులు, తేలు, పాముల్లాంటి పాకే జీవుల గురించి తెలిపితే, మిగిలినవి కేవలం అంగ విక్షేపాల గురించే తెలుపుతాయి.

అభినవగుప్తుడైతే వాక్యాలు (డైలాగ్స్), పదాల్ని (మాటలు) ఎలా అభినయించి చూపించాలో చాలా చక్కగా వివరించాడు. అయితే భట్టతోతుడు మరోలా చెప్పాడు. వాక్యాల్ని అభినయించేట ప్పుడు చారులకు ప్రాధాన్యం ఉంటుందని, పదార్థాల్ని అభినయించేటప్పుడు ఒక వాక్యమే ఉంటే ఔచిత్యాన్ని పాటించి ప్రాధాన్యమివ్వాలని, ఉపనిషత్తులు (జాయన "... రహస్యం" అన్నాడు) చెబుతున్నాయని చెప్పాడు. ఏ కరణానికి హస్తాన్ని అభినయించాలో అక్కడ వాక్యార్థాన్ని అభినయిం చాలి. అంతే తప్ప సాధారణ నాట్యంలో మాత్రం ఇలా చెయ్య కూడదు. ఇందులో కేవలం నృత్త హస్తమే ప్రధానంగా ఉంటుంది.


అసలు నాట్యమంటేనే వాక్యార్థాభినయమనీ, నృత్యమేమో భావాభినయమనీ ధనంజ యాదుల మతమైతే అభినవగుప్తుని అభిప్రాయం మాత్రం ఇందుకు వేరేలా అనిపిస్తుంది.

కరణాలందైతే సాధరణంగా ఎడమ చేతిని వక్షభాగంపైనా, కుడి చేయి (లతాహస్తంగా) మాత్రం పాదాలకు అనుగుణంగా ఉంటుంది. అందుకే కరణాన్ని ఆరంభించే సమయంలో సాధారణంగా కాళ్ళను సమానంగా పెట్టడం, చేతులు లతా హస్తాలుగా, శరీరం చతురశ్రం గా (ఎందుకంటే ఇది వైష్ణవ స్థానమని కొందరు చెప్పారు) ఉండాలి. కరణాల్ని చెప్పడంలో హస్త, పాదాలు, ఇతర శరీర భాగాల చేతలు మాత్రం చాలా తేడాగా ఉంటాయి. 'పిమ్మట, తరువాత' అని చెప్పేటప్పుడు మాత్రం విధిగా క్రమాన్ని పాటించాల్సిందే. మిగిలిన చోట్ల చెప్పినా, చెప్పక పోయినా పనులన్నీ ఒకే సమయంలో జరగాలి. కరణాల్ని ఉపయోగించేటప్పుడు ఎడమకాలని ప్రత్యేకించి సూచించకపోతే కుడి పాదం తోనే ప్రారంభించాల్సి ఉంటుంది.

నాట్యశాస్త్రంలో కరణాల గురించి ఉన్న నిర్వచనాలు మాత్రం చాలా క్లుప్తంగా, నిక్కచ్చిగా ఉంటాయి. వీటిని అభినవగుప్తుడు తన వ్యాఖ్యానంలో విశేషంగానే వివరించాడు. అయితే అంతకన్నా ముందే కీర్తిధరుడు, భట్టతండువులాంటి వారు మాత్రం భరత సంప్రదాయానికి కొంచెం తేడాగా చెప్పారు. ఇలా చెప్పారని కూడా అభినవగుప్తుడు అక్కడక్కడా మతాంతరంగా పేర్కొన్నాడు. ఇతని తరువాత చాలావరకూ అభినవ భారతీ వ్యాఖ్యననుసరించే శార్ఙ్గదేవుడు, జాయసేనాపతి లాంటి వారు కరణాల్ని విశదీకరించారు. అయితే మనకు తెలిసినంత వరకూ కరణాల లక్షణాల్లో నాలుగు దశలు కనిపిస్తాయి. ఇవే కాకుండా దేవా లయ గోపురాలపైనా తదితర చోట్ల కరణాలకు శిల్పాలు ఉదాహరణంగా, ఆధారం గానూ కనిపిస్తాయి. ఇందుకు ప్రత్యేక్ష ఉదాహరణ లుగా చిదంబరంలోని నటరాజ ఆలయ గోపురం, తంజావూరు బృహదీశ్వరాలయగోపురం మొదట ి అంతస్థులోనూ, కుంభకోణం లోని సారంగపాణి దేవాలయం ఇంకా, వృద్ధాచలం, తిరువన్నామలై ఆలయాలను పేర్కొనవచ్చు.

అలాగే 1914లో పురాతత్త్వశాఖ వారు చిదంబరాలయంలో కరణాలు ఉన్నట్టు గుర్తిం చారు. నటరాజస్వామి ఆలయం నాలుగు వైపులా ఉన్న గోపురంపై భరతముని చెప్పిన 108 కరణాల శిల్పాలున్నాయి. అయితే తూర్పు-పశ్చిమ గోపురం పక్కలపై ఉన్న శిల్పాలకు నాట్యశాస్త్రంలో చెప్పిన లక్షణ శ్లోకాలే ఆధారంగా కనిపిస్తాయి. ఈ మేరకు ఒక్కో కరణాన్ని ఒక్కో శిలాఫలకంపై చెక్కి ఉన్నట్టు కనిపిస్తుంది. ఇలా ప్రతి ఫలకంపైనా చెక్కిన నర్తకీమణుల్లో ఒక భుజానికి మృదంగా (మద్దెల)న్ని పట్టుకున్నట్టుండగా, మరో నర్తకి తాళం వాయిస్తున్నట్టు కనిపిస్తుంది. ఈ విధంగా ఒక్కో ఫలంపైనా ఈ ఫలకాలు ఒకదానిపై ఒకటి కూర్చడంతో బాగా దగ్గరగా కలిసిపోయి ఉన్నట్టుంటాయి. ఇలా ఒక్కో స్తంభంపైనా ఎనిమిది ఫలకాలుంటాయి. ఇలాంటి స్తంభాలు మొత్తం గోపుర ద్వారానికి రెండు పక్కలా ఏడేసి ఉన్నాయి. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే 2×7×8=112 శిలా ఫలకాలు కనిపి స్తాయి. 'శిలలపై శిల్పాలు చెక్కినారు... మనవాళ్లు సృష్టికే అందాలు దిద్దినారు...' అన్న కవి పాటకు జీవం పోస్తున్నట్టు ఉంటుంది ఒక్కొక్క నర్తకీ శిల్పం. వాటి అందాల్ని నోరారా జుర్రుకోవడానికీ, రెప్ప వేయకుండా కనులారా చూసేందుకు ఎన్ని రోజులు అక్కడ గడిపినా అక్కడినుంచి ఎప్పటికీ వెళ్లిపో బుద్ధి కాదన్న విషయంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అంత 'రమణీ' యంగా, కమనీయంగా ఉంటాయన్న మాట.

అయితే అక్కడక్కడా కనిపిస్తున్న శిల్పాలకు, వాటి కింద ఉన్న శ్లోకాలకూ సమన్వయం కావడం లేదన్న వాదన బాగా వినిపిస్తోంది. ఇందుకు ఆలయం బాగా పాతకాలం నాటిది కావడం ఒకటైతే, దీన్ని పునరుద్ధరించే సమయంలో శిల్పాలను అమర్చే పద్ధతిలో సరైన క్రమాన్ని పాటించకపోవడం కూడా అయి ఉండవచ్చు. అలాగే లక్షణ లక్ష్యాల్లో కూడా తేడా కనిపిస్తుంది. దీనికి కారణం ఆయా శిల్పుల్లో ఉన్న అభిరుచులు కావొచ్చు. అలాగే ఆయా కరణాల్లోని భావాన్ని శిల్పులు అర్థం చేసుకు ఉండక పోవచ్చు. ఇవీ కాక కొన్ని శిల్పాలకు ఆలయానికి వేసిన సున్నపు పూత అడ్డం పడి ఉండొచ్చు. ఇంకా కొన్ని శిథిలావస్థకు చేరిన కారణంగా విరిగిపోయి ఉండొచ్చు. కారణం ఏదైనా శిల్పాలకు, వాటి కిందనున్న శ్లోకాలకు పొంతన లేదన్నది మాత్రం వాస్తవం.



అయితే 1914లో ఇక్కడ ఈ కరణాలున్నట్టు గుర్తించిన పురాతత్త్వశాఖాధికారులు కేవలం 93 కరణాలకు మాత్రమే చెక్క బ్లాకులను అమర్చి 'ఎపి గ్రాఫికా ఇండికా'లో ప్రకటించారు. అందుకేనేమో 1926లో మానపల్లి రామకృష్ణ కవి నాట్యశాస్త్రం ప్రథమ సంపుటా (1-7 అధ్యాయం) న్ని ప్రకటించినప్పుడు ఈ 93 కరణాల్నీ అందులో చేర్చారు. అలాగే 1936లో డా. బి.వి. నారాయణ స్వామి నాయుడు, వారి సహచరులు కలిసి 'తాండవ లక్షణం' పేరిట నాట్య శాస్త్రం నాలుగో అధ్యాయానికి ఆంగ్లానువాదాన్ని వెలువరించారు. వీళ్ళే ఆయా ఆలయాలపై ఉన్న 108 కరణాలకు ఫోటోలు తీసి వాటిని కూడా తమ ఈ గ్రంథంలో చేర్చకపోవడం విశేషం. అలాగే 1940 జూన్‌లో విడుదలయ్యే మోడ్రన్ రివ్యూ సంచి కలో ఒక వ్యాసం రాస్తూ పి.ఎస్. నాయుడు ఈ కరణ శిల్పాలన్నింటిని తానే స్వయంగా ఫోటోలు తీసి వాటిలో 30 చిత్రాలను మాత్రం వేయించారు. ఇంకా 1955లో 'ద క్లాసికల్ డాన్స్ పోసెస్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని రాసిన గోపినాథ్, ఎస్.వి. రమణరావులు కూడా



## నిస్వార్థ సేవామూర్తులు

# నైటింగేల్ నర్సులు

**ఆసుపత్రి కరోనా వార్డులో అవిశ్రాంతంగా సేవలు నిర్వహించిన నర్సులు రోగుల చికిత్సలో తమ ప్రాణాలను అడ్డుపెట్టడం, అదే కరోనా విషకోరలకు చిక్కి పలువురు నర్సులు తనువు చాలించిన వార్త మనందరి హృదయాలను కలిచి వేశాయి. వందల వేల రోగులకు స్వాంతన చేకూర్చే చిరునవ్వుల పలుకులు, కంటికి రెప్పలా కాపాడే ఆదర్శ సేవాతత్పరులు, అందరి బాధల్ని తన బాధలుగా భావించే ఆదర్శ అతివలు, రోగి చిరునవ్వును తలిచే వైద్యరంగ సైనికులు, ఆదరణలో శిఖరాగ్ర సమానులైన హెల్త్ వారియర్స్, తమ ప్రాణాలను సహితం పణంగా పెట్టి కూడా విధి నిర్వహణలు చేసిన శ్వేత వర్ణ నైటింగేల్ నర్సులు మహా ప్రళయ కష్టకాలంలో మానవాళికి ఆరోగ్య శ్వాసను అందించే వృత్తిలో నిమగ్నమై ఉన్నారు. అలుపెరుగని పోరాటం చేస్తూ, రోగులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, ప్రాణాలను కాపాడుటలో అహర్నిశలు శ్రమిస్తున్న నర్సులు మనందరికీ మానవరూపంలో ఉన్న దేవతలుగా కనిపిస్తున్నారు.**





వైద్య ఆరోగ్యశాఖలో గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రుల వరకు నర్సులు లేకుండా వైద్యం జరుగదు. వైద్యులే ప్రధానం అయినప్పటికీ, నర్సులు రోగులతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి, కుటుంబ సభ్యుల్లా కలిసిపోయి, వైద్య, వ్యక్తిగత సేవలను అందిస్తూ, మన స్వంత 'సిస్టర్స్'గా అద్వితీయ సేవలను అందిస్తున్నారు. కరోనా మహమ్మారి కమ్మిన విష మబ్బులను పారద్రోలే సైనికుల్లా నర్సులు ప్రజల మనస్సుల్ని చూరగొనడం చూసాం. వైద్యులు రోగ నిర్ధారణ, మందుల సిఫార్సు, ఆపరేషన్లు లాంటి ముఖ్య సేవలు అందించినా, నర్సుల నిరంతర ప్రమేయం లేకుండా వైద్యం పూర్తి కాదు. అన్ని ఉద్యోగాల్లోకి నర్సింగ్ వృత్తి అతి పవిత్రమైందని, విలువలతో కూడినదని అందరూ అంగీకరించాల్సిందే.

### ఏ లేడీ విత్ ది ల్యాంప్:

వైద్యరంగంలో నర్సుల పాత్రను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా ఫ్లోరెన్స్ నైటింగేల్ (12 మే 1820 – 13 ఆగష్టు 1910) జన్మదినం సందర్భంగా 12 మే రోజున 'అంతర్జాతీయ నర్సుల దినం' ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. ఆధునిక నర్సింగ్‌కు పునాదులు వేసిన 'ఏ లేడీ విత్ ది ల్యాంప్'గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్ 1850లో యుద్ధ క్షతగాత్రుల చికిత్సలో చేతుల పరిశుభ్రత, ఇతర నర్సింగ్ జాగ్రత్తలు తీసుకుంటూ మరణాలను 42 శాతం నుంచి 2 శాతం వరకు తగ్గించగలిగారు. నైటింగేల్ శతాబ్ది జన్మదినోత్సవాల సందర్భంగా 12 మే 1954తో ప్రారంభమైన ఈ నర్సుల దినోత్సవం, 1965 నుంచి అంతర్జాతీయంగా నిర్వహించుట ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది అంతర్జాతీయ నర్సుల దినం–2024 నినాదంగా 'నర్సెస్ మేక్ ది డిఫరెన్స్ ' అనే సముచితమైన అంశాన్ని తీసుకొని ప్రపంచ దేశాలన్నీ ఘనంగా నిర్వహించడం ముదావహం.

(మిగతా 8వ పేజీలో)

(7వ పేజీ తరువాయి)



**అమూల్య వైద్య సేవలు:**

'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' నేతృత్వంలో నిర్వహించబడే అంతర్జాతీయ నర్సుల వారోత్సవాల (09 మే నుంచి 15 వరకు) వేదికగా నర్సుల సేవలను కొనియాడడం, కృతజ్ఞతలు తెలపడం, బహుమతులు/పుష్పగుచ్ఛాలు/గ్రీటింగ్ కార్డులు అందించడం, శుభాకాంక్షలను తెలుపడం వంటి కార్యక్రమాలను చేయటానికి ప్రయత్నించాలి. తల్లి ప్రసవ వేదనను తన నొప్పిగా భావించి శిశు జననానికి చేయూతనిచ్చి, శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణతో ప్రారంభమై మనిషి తుది శ్వాస వరకు ప్రతి అనారోగ్య సమయంలో ఆదుకునే నర్సులు ప్రతి వ్యక్తి జీవితంలో ప్రధాన భాగమై ఉంటారు. వైద్యరంగానికి వెన్నెముకగా నర్సులు 59 శాతం వైద్య సేవలను అందిస్తున్నారు. ఐరాస, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా నిర్వహించే నర్సుల దినం సందర్భంగా ఆధునిక నర్సుల సేవలు, శిక్షణలో శాస్త్రీయ మార్పులు లాంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కరోనా విజృంభనతో నర్సింగ్ వృత్తి కొత్త సవాళ్ళను ఎదుర్కొన్నది. కోవిడ్-19 కోరల్లో చిక్కిన ప్రపంచ మానవాళికి నర్సులు అపురూప ప్రాణదాతలుగా కనిపించారు. పిపిఈ కిట్లు ధరించడం, కుటుంబాలకు దూరంగా పలు రోజులు ఆసుపత్రుల్లో ఉంటూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడం లాంటి ప్రాణాపాయ విధులను ధైర్యంగా నిర్వహించిన నర్సులు సదా ప్రశంసనీయులే. రోగుల వేదనలు, రోదనలకు ఔషధాలుగా నర్సుల ప్రశాంత పలుకులు, అభయ హస్త స్పర్శలు పని చేస్తాయనేది వాస్తవం.



నర్సుల తీవ్ర కొరత:

ఐరాస అంచనా ప్రకారం 2030 నాటికి 18 మిలియన్ల సుశిక్షితులైన నర్సుల కొరత ఏర్పడుతుందని తెలిపింది. సమాజ ఆరోగ్య, జీవన ప్రమాణాలను మెరుగు పరిచే నర్సింగ్ వృత్తి భారతదేశంలో 1664లో ఈస్ట్ ఇండియా కంపెనీలో ప్రారంభమైంది. నర్సింగ్ వృత్తి మహిళలకే వర్తిస్తుందని, పురుషులకు సరికాదనే అంధవిశ్వాసం భారత సమాజంలో నెలకొని ఉంది. భారత్‌లో ప్రతి వెయ్యి మంది జనాభాకు 1.7 నర్సులు (ఒక డాక్టర్‌కు 1,511 జనాభా) మాత్రమే ఉన్నారు. ప్రతి వెయ్యి జనాభాకు ముగ్గురు నర్సులు, ఒక డాక్టర్ ఉండాలని ఐరాస సూచిస్తున్నది. మన దేశంలో 3.07 మిలియన్ల రిజిస్టర్డ్ నర్సులు, 1.1 మిలియన్ల ఫార్మసిస్టులు, 1.2 మిలియన్ అల్లోపతిక్ డాక్టర్లు ఉన్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. ఐరాస వివరాల ప్రకారం ఇండియాలో నర్సుల కొరత అత్యధికంగా ఉందని, మన దేశం నుంచి అనేక మంది నర్సులు అమెరికా, ఇంగ్లాండ్, మిడిల్ ఈస్ట్ దేశాలను వలసలు వెళ్ళుతున్నారని తేలింది.



**నర్సులకు విదేశీ ఆదరణ:**

భారతీయ నర్సులకు విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. కరోనా అలల చేదు అనుభవంతో తెలంగాణ ప్రభుత్వం తాజాగా 50 వేల మంది డాక్టర్లతో పాటు పెద్ద సంఖ్యలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర పారామెడికల్ సిబ్బంది సేవలను యుద్ధ ప్రాతిపదికన తీసుకోవడానికి నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామంగా పేర్కొనవచ్చు. మానవాళి ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి అవిశ్రాంత వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ముఖ్యంగా నర్సులను 'హెల్త్ వారియర్స్'గా గుర్తించి, వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలను తెలపడం మన కనీస బాధ్యత.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# ఎన్ చాన్ట్ కేఫ్ లో నోరూరించే కొత్త మెనూ

ఆహా ఏమి రుచి..

ఎన్చా న్ట్ కేఫ్ అండ్ కన్ఫెక్షనరీ ఈ సీజన్ లో కొత్త మెనూని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది . కేఫ్ దాని ఆరోగ్యకరమైన బేక్డ్ ప్రోడక్ట్స్ , ఆహ్లాదపరిచే పానీయాలు మరియు సాంప్రదాయ రుచులు, ప్రపంచ శ్రేణి వంటకాలతో తియ్యని, రుచికరమైన వంటకాలకు ప్రసిద్ధి చెందింది. ఆధునిక ప్రెజెంటేషన్లు మరియు వంట పద్ధతుల యొక్క రసవాదానికి అనుగుణంగా ఉండే కలినరీ కళను పునర్నిర్వచించడానికి మరియు మీకు ప్రత్యేకమైన ఫ్యూజన్ డైనింగ్ అనుభవాన్ని అందించడానికి కొత్త మెనూ ఖచ్చితంగా రూపొందించబడింది.

క్రీమ్ ఆఫ్ బ్రోకలీ %ఊ% ఆల్మండ్, బర్న్ట కార్న్ చౌడర్, వాటర్ మెలన్ %ఊ% ఫెటా సలాడ్ మరియు గ్రీక్ సలాడ్ వంటి సూప్లు మరియు సలాడ్లను కలిగి ఉండే నోరూరించే కొత్త మెనూ తో మీ టేస్ట్ బడ్స్ కు పసందైన విందు ను అందించటానికి , మనసును కదిలించే ఆహార అనుభవాలను పొందండి.

రోజ్మేరీ గ్రిల్డ్ చికెన్ క్రోస్టినీ, మింటీ చీజ్ క్రోక్వేట్స్, గ్రిల్డ్ చెర్మోలా చికెన్, మరియు కార్న్ ఆన్ టోస్ట్, షిష్ టౌక్, మొజారెల్లా చీజ్ స్టిక్స్ మరియు క్యూసాడిల్లాస్, మష్రూమ్ రిసోట్టో, కానోలీనీ ఫ్లోరెంటైన్, కూరగాయల తో రోస్ట్ చికెన్ మరియు డేమి గ్లాజ్ సాస్ , చికెన్ పర్మేసాన్ వంటి వంటకాలు ప్రధాన కోర్సులో ఉన్నాయి.

క్రోక్ మాన్సియర్ శాండ్విచ్, లెబనీస్ ప్లాటర్ మరియు బ్లాక్ ఆలివ్ మరియు సన్డ్రైడ్ టొమాటో బ్రస్చెట్టా వంటి కొన్ని బ్రెడ్లు మరియు ర్యాప్లు కూడా మెనూ లో జోడించబడ్డాయి.

కొత్త మెనూ ఆవిష్కరణ పై ఎన్చాన్ట్ వ్యవస్థాపకురాలు శ్రీమతి దీపా దాదు మాట్లాడుతూ, "మా అతిథులు మరియు పోషకులకు ఉత్సాహాన్ని కలిగించడానికి మా మెనూలో కొత్త వంటకాలను జోడించేందుకు ఎన్చాన్ట్ కేఫ్లో మేము నిరంతరం ప్రయత్నిస్తున్నాము. మా కస్టమర్లు మెరుగైన అనుభవాన్ని పొందాలని మేము కోరుకుంటున్నాము. కొత్త మెనూ కాంటినెంటల్ మరియు మెడిటరేనియన్ వంటకాలను కలిగి ఉంది..." అని అన్నారు.

ఈ సందర్భంగా ఎన్చాన్ట్ సహ వ్యవస్థాపకుడు శ్రీ మహేశ్ తిబ్రేవాల్ మాట్లాడుతూ, "రుచి మరియు సృజనాత్మకత యొక్క సరిహద్దులను ముందుకు తీసుకురావడానికి మేము కృషి చేస్తున్నందున, మా కొత్త మెనూ ప్రారంభం మాకు ఒక ఉత్తేజకరమైన మైలురాయిని సూచిస్తుంది.




మేము ప్రతి వంటకాన్ని అసాధారణ డైనింగ్ అనుభవాలను అందించటానికి చాలా జాగ్రత్తగా రూపొందించాము. ఫ్యూజన్-ప్రేరేపిత క్రియేషన్ల నుండి బోల్డ్ రుచుల వరకు, మా కస్టమర్లను ఆశ్చర్యపరచడం మరియు ఆనందపరచడం మా లక్ష్యం. మేము మా నైపుణ్యం మరియు అభిరుచిని ప్రతి డిష్ లోనూ చూపుతున్నాము మరియు మా అతిథులు ఈ ప్రత్యేకమైన కలినరీ ప్రయాణాన్ని ఆస్వాదించడాన్ని చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము . ఈ మెనూ ను వినూత్నం గా వార్గాం కోసం సిద్ధం చేసాము " అని అన్నారు. ఈ ప్రత్యేకమైన మెనూ 14-06-2023 నుండి అల్పాహారం, భోజనం మరియు రాత్రి భోజనం కోసం అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్లోని ఎన్చాన్ట్ కేఫ్ అండ్ కన్ఫెక్షనరీలో కొత్త మెనూని అనుభవించడానికి రండి.










# జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా ఏబీవీపీ

సాధారణ విద్యార్థులను రాజకీయాలకు అతీతంగా దేశభక్తులుగా తీర్చిదిద్దుతూ ప్రపంచ దేశాలలో గౌరవప్రద దేశంగా నిలబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్న క్యాడర్ బేస్ట్ మాస్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ. స్వతంత్ర్యం వచ్చాక దేశ యువతలో బానిసత్వాన్ని తొలగించి వారిని చైతన్యం చేసేందుకు 1949 జులై 9న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఏర్పాటైంది. 73 వసంతాలు పూర్తి చేసుకొని 74 వసంతంలోకి అడుగుపెట్టింది. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ, విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంచుతూ జాతి పునర్ నిర్మాణమే లక్ష్యంగా వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్ నిర్మాణం అనే సిద్ధాంతాన్ని నమ్మి ముందుకు సాగుతుంది ఏబీవీపీ.

**ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంఘం...!**

మారుమూల గ్రామాల నుంచి మహా నగరాలు వరకు విస్తరిస్తూ విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఏబీవీపీ ముందుండి పరిష్కరిస్తోంది. కాలేజీల్లో సౌలతులు, ఫీజు రియంబర్స్ మెంట్, హాస్టళ్లలో సమస్యలు, అకడమిక్ ఇబ్బందులు.. ఇలా విద్యార్థుల సమస్యలే కాదు,దేశాన్ని విచ్ఛిన్నం చేసే సంఘటన ఎక్కడ జరిగినా అనుక్షణం స్పందిస్తోంది.దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన ఏబీవీపీ నేడు కాశ్మీర్ నుండి కన్యాకుమారి, అటక్ నుండి కటక్ వరకు విస్తరిస్తూ 35 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంస్థగా విరాజిల్లుతోంది. గడిచిన 73. ఏండ్లలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని మరెన్నో విజయాలను చూసింది. ఏబీవీపీలో నాణ్యానికి ఒకవైపు ధర్నాలు, రాస్తారోకోలు, పాఠశాలలు మరియు కళాశాలలు బంద్ ఏ కాకుండా నాణ్యానికి మరోవైపు ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా 'సృజన' మెడికల్ విద్యార్థుల కోసం 'మెడివిజన్', మన దేశంలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు మన సంస్కృతి. సంప్రదాయాలను పరిచయం చేస్తూ %ఔూ%, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల కోసం '%ూజుూ%', గిరిజన విద్యార్థుల కోసం 'వనవాసి' పర్యావరణ పరిరక్షణ కోసం 'స్టూడెంట్ ఫర్ డెవలప్ మెంట్' విద్యార్థుల్లో సేవా భావం పెంచేందుకు స్టూడెంట్ ఫర్ 'సేవ', విద్యార్థి కళాకారులను ప్రోత్సహించే దుకు 'కళామంచ్', ఐఐటీ, నిట్ స్థాయి విద్యార్థుల కోసం 'థింక్ ఇండియా'ఇండియా', లా విద్యార్థులకు లా ఫోరం, క్రీడా పై ఆసక్తి గల విద్యార్థుల కోసం ఖేల్...ఇలా అనేక రకాల కార్యక్రమాలతో విద్యార్థులకు లీడర్ షిప్ ను అందిస్తూనే... దేశ వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది. ఇలా జాతీయ పునర్ నిర్మాణం మహాయజ్ఞంలో పని చేసిన అనేక మంది నేడు ప్రధాని,ఉపరాష్ట్రపతి మొదలు ప్రజాప్రతిని దిగానూ, ఉన్నత ఉద్యోగస్తులు,శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఇలా ప్రతి రంగంలోను ఏబీవీపీ నేర్పిన క్రమశిక్షణ,కార్యదీక్షతో ముందుకెళ్తున్నారు.

**సిద్ధాంతం కోసం పని చేస్తూ...!**

జాతీయవాద సిద్ధాంతం కోసం.కాలేజీ క్యాంపస్ లలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పుటకై అనేక మంది ఏబీవీపీ కార్యకర్తలు ప్రాణత్యాగం చేసి సంఘటనలు వింటేనే రక్తం మరుగుతుంది.ఆనాడు కాలేజీ క్యాంపస్ లలో భారత్ మాతా కీ జై,వందేమాతరం అని నినదిస్తే చంపేస్తామని బెదిరించే విదేశీ సిద్ధాంతమైన కమ్యూనిస్టు, వాటి అనుబంధ సంఘాలు కాకతీయ యూనివర్సిటీ లాంటి క్యాంపస్ లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అప్పటి వీసీ జాతీయ జెండా ఎగురవేస్తున్న సందర్భంలో రాడికల్స్ రౌడీల్లా వచ్చి ఇది బూటకపు స్వాతంత్ర్యమని జాతీయ జెండాను అవమానిస్తూ నల్ల జెండా ఎగురవేస్తున్న సమయంలో ఏబీవీపీ కార్యకర్త జగన్మోహన్ జీ ఒక్కడే రాడికల్స్ ను ఎదిరించి జాతీయ జెండాను ఎగురవేశారు... దీంతో రాడికల్స్ ఆయనను అతి కిరాతంగా హత మార్చారు. ఇదే మాదిరిగా ఓయూలో మేరెడ్డి చంద్రన్న, నల్గొండ జిల్లాలో ఏచూరి శ్రీనన్న. కరీంనగర్ జగిత్యాల లో రామన్న, గోపన్న ఇలా తెలంగాణ ప్రాంతంలో 40 మందికి పైగా విద్యార్థి పరిషత్ కార్యకర్తలు బలయ్యారు. ప్రాణాలు పోతాయని తెలిసి కూడా ఏబీవీపీ కార్యకర్తలు ఏనాడూ భయపడలేదు. నమ్మిన సిద్ధాంతం కోసం పని చేస్తూ..నేటి మా తరానికి ఎంతో స్ఫూర్తినిచ్చారు. ఫలితంగా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ నేటి ఏబీవీపీ కార్యకర్తలు లి"మీ రక్తం వృధా కాదు మీ ఆశయం ఆగిపోదు"లి "క్షణం క్షణం మా కణం కణం భరతమాతకే సమర్పణం", భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ సమాజ సేవలో ముందుకు సాగుతున్నారు.

**సమాజంలోని సమస్యల పరిష్కార కేంద్రంగా..!**

మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా గోదావరి, కృష్ణమ్మలు మన ప్రాంతం దిక్కు మల్లాలి అంటూ జల చైతన్య యాత్రలు, బాసర నుంచి శ్రీశైలం వరకు సస్యశ్యామల యాత్ర, నా రక్తం,నా తెలంగాణ, హరిత తెలంగాణ లాంటి నిర్మాణాత్మక ఉద్యమాలు నిర్వహించింది. మలిదశ ఉద్యమంలో 2010 జనవరిలో భారత పార్లమెంట్ ప్రతిపక్ష నాయకురాలు సుష్మస్వరాజ్ ను తీసుకొచ్చి లక్షమంది విద్యార్థులతో తెలంగాణ విద్యార్థి రణభేరి నిర్వహించి ఉద్యమం పట్ల దేశ ప్రజల దృష్టి కేంద్రీకరించేలా చేసింది. ఇప్పుడు ఏబీవీపీ విద్యార్థుల సంక్షేమం కోసం,సమకాలిన సమస్యల పరిష్కార కేంద్రంగా,విద్యారంగంలో రావలసిన సంస్కరణల కేంద్రంగా వారిలో నైపుణ్యాలను పెంపొందించే స్కిల్స్ డెవలప్మెంట్ కేంద్రంగా,పేద విద్యార్థులలో జాతీయ భావాలు నెలకొల్పేలా,అనే ఇక విద్యారంగ సమస్యలు పరిష్కార కేంద్రంగా ఏబీవీపీ కార్యకర్తల సొంతం.

రాబోయే రోజుల్లో ఏబీవీపీ 75 వసంతాల సందర్భంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వినూత్న కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ మహా ఉద్యమంలో విద్యార్థులంతా భాగస్వామ్యులై దేశ అభివృద్ధిలో పాలుపంచుకుందాం.

సభావట్.కళ్యాణ్
9014322572

## సినిమా రివ్యూ



కొంత విరామం తర్వాత నారా రోహిత్ హీరోగా నటించిన సినిమా 'ప్రతినిధి 2'. కొన్నాళ్ల క్రితం వచ్చిన 'ప్రతినిధి'తో ఆయన విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకున్నారు. ఏపీలో ఎన్నికలకు ముందు 'ప్రతినిధి 2' అనేసరికి ప్రేక్షకులతో పాటు రాజకీయ వర్గాల్లో సైతం ఆసక్తి ఏర్పడింది. జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు దర్శకుడిగా పరిచయమైన ఈ సినిమా ఎలా ఉంది? ఇందులో పొలిటికల్ కాంట్రవర్సీ ఉందా? లేదంటే రాజకీయ నేపథ్యంలో థ్రిల్లర్ సినిమా తీశారా? అనేది రివ్యూలో చూడండి.

**కథ** : చే... చేతన్ (నారా రోహిత్) నిజాయతీ గల జర్నలిస్ట్. తన ప్రాణం మీదకు వచ్చినా సరే భయపడకుండా ప్రజలకు నిజాలు చెప్పాలని ధృఢ సంకల్పం ఉన్న వ్యక్తి. కొన్నాళ్ల క్రితం అమెరికా వెళ్లిపోయిన సీనియర్ జర్నలిస్ట్ (ఉదయభాను) ఇండియా తిరిగి వచ్చి ఛానల్ పెడుతుంది. ఏరి కోరి మరీ చే దగ్గరకు వెళ్లి అతడిని తన ఎన్ఎన్‌సి ఛానల్ సీఈవో చేస్తుంది.

గజేంద్ర (అజయ్ ఘోష్)ను ఇంటర్వ్యూ చేసిన చే... అతని అక్రమాలు వెలుగులోకి తీసుకు రావడంతో మంత్రి పదవి పోతుంది. పార్టీ నుంచి సస్పెండ్ అవుతాడు. ఉప ఎన్నికల్లో గజేంద్రకు ప్రత్యర్థిగా నిలబడిన అధికార పార్టీ అభ్యర్థి నరసింహ (పృథ్వీ) అక్రమాలు సైతం వెలుగులోకి తెస్తాడు చే. అతడి మీద దాడులు జరిగినా అసలు భయపడడు. వరుసగా సంచలన కార్యక్రమాలు చేసిన 'చే' ముఖ్యమంత్రి ప్రజాపతి (సచిన్ ఖేడేకర్) దృష్టిలో పడతాడు. అయితే... సీఎం క్యాంపు ఆఫీసులో జరిగిన బాంబు బ్లాస్ట్ కేసులో 'చే'ను పోలీసులు అరెస్ట్ చేస్తారు.

ముఖ్యమంత్రి హత్య వెనుక ఎవరు ఉన్నారు? ఆయన్ను చంపాల్సిన అవసరం ఎవరికి వచ్చింది? బాంబు బ్లాస్ట్ కేసులో 'చే'ను ఎందుకు అరెస్ట్ చేశారు? సీఎం మరణం తర్వాత ఆయన కొడుకు విశ్వ (దినేష్ తేజ్) ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చివరి నిమిషంలో ఎందుకు ఆగింది? సీఎం బాంబు బ్లాస్ట్ కేసును విక్రమ్ సంతోష్ (జిష్షుసేన్ గుప్తా) ఎలా సాల్వ్ చేశారు? ప్రభాస్ మిత్రా (అజయ్) పాత్ర ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ ..** సినిమా ఎలా ఉందనేది చెప్పడానికి ముందు ఓ విషయంలో ప్రేక్షకులకు క్లారిటీ ఇవ్వాలి. టీడీపీ అధినేత నారా చంద్రబాబుకు హీరో నారా రోహిత్ స్వయానా సోదరుని కుమారుడు కావడం, జర్నలిస్ట్ మూర్తి టీడీపీ మద్దతుదారుడనే ప్రచారం ఉండటంతో... 'ప్రతినిధి 2' టీడీపీకి అనుకూలంగా, మరో పార్టీకి వ్యతిరేకంగా ఉంటుందనే మాట లు వినిపించాయి. ఇది ఏ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా తీసిన సినిమా కాదు. కానీ, సీఎంతో పాటు అతని కుమారుడి పాత్రలు చూస్తే ఏపీలో ముఖ్యమంత్రులుగా చేసిన తండ్రి కొడుకులు గుర్తుకు రావడం ఖాయం. అయితే, వాళ్లు అని ఘంటాపథంగా చెప్పలేం.

'ప్రతినిధి 2'లో వాస్తవ పరిస్థితుల స్ఫూర్తితో రూపొందించిన సన్నివేశాలు ఉన్నాయి. అందులో మరో మాటకు తావు లేదు. అవినీతి రాజకీయ నేతలు, ప్రజా ప్రతినిధుల్ని ఎండగట్టే సన్నివేశాలు ఉన్నాయి. అందులో సందేహం అక్కర్లేదు. తప్పనిసరిగా ఓటు వేయాలని ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే సన్నివేశం ఉంది. రచయితగా, దర్శకుడిగా జర్నలిస్ట్ మూర్తి తొలి సినిమాలో మెరుపులు చూపించారు. అయితే, కథకుడిగా ప్రారంభం నుంచి ముగింపు వరకు టెంపో కంటిన్యూ చేయలేకపోయారు.

టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో అజయ్ ఘోష్, నారా రోహిత్ సన్నివేశం 'ఒకే ఒక్కడు'లో అర్జున్ %d% రఘువరన్ ఇంటర్వ్యూను గుర్తు చేస్తుంది. ఇన్వెటిగేషన్ ప్రాసెస్ అంతా రామ్ చరణ్ 'ధృవ' తరహాలో ఉంటుంది. 'ప్రతినిధి 2' మీద గతంలో వచ్చిన సీన్స్, ఫిలిమ్స్ ప్రభావం ఉన్నా... కమర్షియల్ ప్యాకేజీలో సినిమాను మలిచారు మూర్తి. ఈ సినిమాలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ మీద సెటైర్లు పడ్డాయి. ప్రభాత్ మిత్రా పాత్రను ఆయన ఉద్దేశించి తీశారని ఈజీగా అర్థం అవుతుంది. పూర్తిగా ఓ పార్టీకి అనుకూలంగా, మరొక పార్టీకి వ్యతిరేకంగా సినిమా తీయలేదు. దాంతో మధ్యస్తంగా మిగిలింది.

'ప్రతినిధి'లో సామాన్య ప్రజలు కనెక్ట్ అయ్యే, ఆలోచింప చేసే డైలాగులు ఉన్నాయి. 'ప్రతినిధి 2'లో ఆ తరహా సన్నివేశాలు, సంభాషణలు తక్కువ. రాజకీయ నాయకుల అవినీతి బయటపెట్టే ఫస్టాఫ్ ఎంగేజ్ చేస్తుంది. సెకండాఫ్ విషయానికి వచ్చేసరికి పూర్తిగా హీరో రివేంజ్ డ్రామా అన్నట్టు మారుతుంది. దాంతో 'ప్రతినిధి' అర్థం, పరమార్థం మారిపోయాయి. సినిమాలో రెండు పాటలూ ఇరికించినట్టు ఉన్నాయి. నేపథ్య సంగీతంలో మహతి స్వరసాగర్ న్యాయం చేశారు. టెక్నికల్ టీమ్ నుంచి మూర్తి మంచి అవుట్ పుట్ తీసుకున్నారు. ప్రొడక్షన్ వేల్యూస్ కూడా బావున్నాయి.

నారా రోహిత్ నటుడిగా ఎప్పుడో ప్రూవ్ చేసుకున్నారు. సినిమాల్లో గ్యాప్ వచ్చింది కానీ ఆయన నటనలో మార్పు లేదు. నటనలో, డైలాగ్ డెలివరీలో మరోసారి పట్టు చూపించారు. వెయిట్ పరంగా కేర్ తీసుకోవాల్సిన అవసరం ఉంది. నారా రోహిత్ తర్వాత జిష్షుసేన్ గుప్తాకు ఎక్కువ స్క్రీన్ స్పేస్ లభించింది. ఇన్వెస్టిగేషన్ అధికారిగా ఆయన నటన ఓకే. సచిన్ ఖేడేకర్, అజయ్ ఘోష్, పృథ్వీ, అజయ్, 'ఈ రోజుల్లో' శ్రీ తదితరులు తమ తమ పాత్రల పరిధి మేరకు నటించారు.

'ప్రతినిధి 2' ఎవరినీ టార్గెట్ చేసిన సినిమా కాదని చెప్పాలి. ఏ పార్టీకీ ఇది వ్యతిరేకం కాదు. ఇదొక పొలిటికల్ థ్రిల్లర్. రాజకీయ అవినీతిని బయటపెట్టే సన్నివేశాలతో ఫస్టాఫ్ పాస్ అయిపోతుంది. ఇన్వెస్టిగేషన్ గ్రిప్పింగ్‌గా సాగితే సెకండాఫ్ రిజల్ట్ మరోలా ఉండేది. సీనియర్ జర్నలిస్టుగా నారా రోహిత్ నటన, దర్శకుడిగా మూర్తి ప్రయత్నం అభినందనీయం. సినిమాటిక్ లిబర్టీ తీసుకుని, ఎవరికీ వ్యతిరేకం కాదన్న కోణంలో ప్రజెంట్ చేయడంతో విజయానికి ఓ మెట్టు దూరంలో సినిమా ఆగింది.

---



సత్యదేవ్ నటనకు అభిమానులు ఉన్నారు. ఎటువంటి సినీ నేపథ్యం లేకుండా హీరోగా ఎదిగిన స్టార్లలో ఆయనొకరు. తొలుత చిన్న చిన్న వేషాలు వేసి... కథానాయకుడి స్థాయికి వచ్చారు. ఆయన హీరోగా నటించిన తాజా సినిమా 'కృష్ణమ్మ'. అగ్ర దర్శకులలో ఒకరైన కొరటాల శివ సమర్పణలో తెరకెక్కిన సినిమా కావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సినిమా ఎలా ఉంది? అనేది రివ్యూలో చూడండి.

**కథ** : భద్ర (సత్యదేవ్), శివ (కృష్ణ తేజ రెడ్డి), కోటి (మీసాల లక్ష్మణ్)... ముగ్గురూ అనాథలు. బెజవాడలోని వించిపేట కుర్రాళ్లు. చిన్నప్పటి నుంచి కలిసి పెరుగుతారు. భద్ర, కోటి గంజాయి స్మగ్లింగ్ వంటి పనులు చేస్తుంటే... శివ చిన్న ప్రింటింగ్ ప్రెస్ రన్ చేస్తూ, ఇద్దరు మిత్రుల్ని స్మగ్లింగ్ మానేయమని చెబుతూ ఉంటాడు. ఇదీ వాళ్ల నేపథ్యం! అనాధలైన భద్ర, శివ, కోటి తమకూ ఓ కుటుంబం ఉండాలని ఆశ పడతారు. మీనా (అతిరా రాజ్)తో శివ ప్రేమలో పడతాడు. భద్రకు ఆమె రాఖీ కట్టడంతో సొంత చెల్లెలు కింద చూస్తాడు. ఆమె పరిచయం తర్వాత గంజాయి స్మగ్లింగ్ మానేసి ఆటో నడపడం మొదలు పెడతాడు. మీనా తల్లి ఆపరేషన్‌కు రెండు లక్షలు అవసరం పడతాయి. చివరిసారిగా భారీ ఎత్తున గంజాయి స్మగ్లింగ్ చేసి వచ్చిన డబ్బుతో ఆపరేషన్ చేయించాలని డిసైడ్ అవుతారు. అయితే, పోలీసులకు దొరుకుతారు. వాళ్ల మీద గంజాయి కేసు కాకుండా రేప్ అండ్ మర్డర్ కేసు నమోదు అవుతుంది. హత్యాచారానికి గురైన అమ్మాయి ఎవరు? ఆమెపై దారుణానికి పాల్పడింది ఎవరు? అసలు కేసు ఏమిటో తెలియకుండా తామే చేశామని శివ, భద్ర, కోటి ఎందుకు అంగీకరించారు? తెలిశాక ఏం చేశారు? ఈ ముగ్గురూ పోలీసుల కస్టడీలో ఉంటే మీనా ఏమైంది? చివరకు ఏమని తేలింది? అనేది సినిమా.

**విశ్లేషణ** : రౌడీయిజం పుట్టింది బెజవాడలో వంటి డైలాగులు తెలుగు ప్రేక్షకులకు కొత్త కాదు. విజయవాడ నేపథ్యంలో యాక్షన్ బేస్డ్ సినిమాలు వచ్చాయి. మరి, ఆయా సినిమాలకు... 'కృష్ణమ్మ'కు తేడా ఏమిటి? ఇందులో కొత్తగా ఏముంది? అనేది చూస్తే? కథగా చూస్తే 'కృష్ణమ్మ'లో చూపించిన ఓ ఎమోషన్ కొత్తది ఏమీ కాదు. కానీ, సత్యదేవ్ పెర్ఫార్మన్స్ వల్ల కొన్ని సన్నివేశాలు కొత్తగా ఉన్నాయి. ముగ్గురు అనాథలు కలిసి పెరగడం, అందులో ఒకరు ప్రేమలో పడటం వంటి సీన్లు ఇంతకు ముందు కొన్ని సినిమాల్లో చూసినవే. అందువల్ల ఇంటర్వెల్ వచ్చే వరకు 'కృష్ణమ్మ' సాదాసీదాగా ఉంటుంది. హీరోతో పాటు అతడి స్నేహితుల్ని అరెస్ట్ చేశాక, వాళ్ల మీద పెట్టినది రేప్ అండ్ మర్డర్ కేసు అనేది రివీల్ అయ్యాక ఒక్కసారిగా సినిమా టోన్ మారింది. ముఖ్యంగా సత్యదేవ్ ఇంటెన్స్ పెర్ఫార్మన్స్ కారణంగా సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్సుల్లో ఎమోషన్ వర్కవుట్ అయ్యింది. సినిమాను రెండు పార్టులుగా కంపేర్ చేస్తే... ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బెటర్.

దర్శకుడు వీవీ గోపాలకృష్ణ కథ, కథనాల్లో కొత్తదనం లేదు. కానీ, దర్శకత్వంలో రా అండ్ రస్టిక్ ఫీల్ తీసుకు రావడంలో సక్సెస్ అయ్యారు. సత్యదేవ్ లుక్ నుంచి బాడీ లాంగ్వేజ్ డిజైన్ చేసిన తీరు బావుంది. కాలభైరవ సంగీతంలో సిద్ శ్రీరామ్ పాడిన పాట బావుంది. నేపథ్య సంగీతం ఓకే. కెమెరా వర్క్, ప్రొడక్షన్ వేల్యూస్ బావున్నాయి. ఇంటర్వెల్ వరకు కామెడీతో పాటు లవ్ ట్రాక్ ఆసక్తికరంగా డిజైన్ చేసి ఉంటే బావుండేది. పతాక సన్నివేశాలను హడావిడిగా ముగించారు. హత్యలు అన్నీ చకచకా చూపించారు. ఆ హత్యలను స్క్రీన్ ప్లేకి వాడుకుంటే బావుండేది. సత్యదేవ్ బెస్ట్ పెర్ఫార్మన్స్ ఇచ్చిన క్యారెక్టర్లలో 'కృష్ణమ్మ'లో భద్ర కూడా ఒకటిగా నిలుస్తుంది. కళ్లల్లో ఇంటెన్స్ చూపించారు. నడిరోడ్డు మీద స్నేహితుడి మరణం తర్వాత ఎక్స్‌ప్రెషన్ ఆయనలో నటుడిని మరోసారి ప్రేక్షకులకు గుర్తు చేస్తుంది. పతాక సన్నివేశాల్లో నటన కూడా బావుంది. హీరో అంటే సాంగ్స్, రొమాంటిక్ సీన్స్ ఉండాలని కోరుకోకుండా పాత్రకు అర్థం చేసుకుని, అందుకు అనుగుణం గా నటించిన సత్యదేవ్ ను మెచ్చుకోవాలి. కోటి, శివ పాత్రల్లో మీసాల లక్ష్మణ్, కృష్ణతేజా రెడ్డి నటన ఓకే. 'కృష్ణమ్మ'తో వెండితెరకు పరిచయమైన అతిరా రాజ్ తొలి సినిమాలో చక్కటి నటన కనబరిచారు. ఆమె నటన సహజంగా ఉంది. హీరోకి జోడీగా, అతని తో ప్రేమలో పడే అమ్మాయిగా అర్చనా అయ్యర్ క్యారె క్టర్ నిడివి తక్కువే. ఉన్నంతలో బాగా చేశారు. రఘు కుంచె పాత్ర నిడివి తక్కువ. మిగతా నటీనటులు తమ తమ పాత్రల పరిధి మేరకు చేశారు. 'కృష్ణమ్మ' చూస్తున్నప్పుడు, సినిమాలో మెయిన్ ట్విస్ట్ రివీల్ అయ్యాక ఇబ్రహీం పట్నంలోని కొన్నేళ్ల క్రితం సంచలనం సృష్టించిన ఓ హత్యాచార ఘటన (ఆయేషా మీరా) గుర్తుకు వస్తుంది. ఆ కథ స్ఫూర్తితో రా అండ్ రస్టిక్ నేపథ్యంలో ఎమోషనల్ యాక్షన్ డ్రామా తీశారు. సత్యదేవ్ నటన బావుంటుంది. స్టార్టింగ్ టు ఎండింగ్ ఎంగేజ్ చేయలేదు కానీ సినిమాలో హై ఇచ్చే మూమెంట్స్ ఉన్నాయి. క్లైమాక్స్ ఓ శాటిస్‌ఫ్యాక్షన్ ఇస్తుంది. తమిళ సినిమాల తరహాలో తీసిన 'రా' అండ్ రస్టిక్ డ్రామా 'కృష్ణమ్మ'. రెగ్యులర్ కమర్షియల్ జానర్ సినిమాల మధ్య డిఫరెంట్ సినిమాలు కోరుకునే ప్రేక్షకులకు బెటర్ ఆప్షన్. హీరో సత్యదేవ్ కోసం వెళ్లవచ్చు!

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :



స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడుప్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com


# 12.5.2024 నుంచి 18.5.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదం

వారం ప్రారంభంలో మిత్రులను కలుస్తారు. వృత్తిపరమైన విషయాలలో సోషల్ మీడియాలో పెట్టుబడి ఆలోచనలు చేస్తారు. స్థిరాస్తుల అంశములలో ఆత్మీయులతో కొంత ఘర్షణాత్మకమైన వాతావరణం, భాగస్వామికి ఆదాయం అభివృద్ధి, గృహాల్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఆలస్యాలు, వాహనములకు సంబంధించిన చిన్నపాటి రిపేర్లు. వృత్తిపరంగా నూతన పెట్టుబడుల కొరకు ఆలోచనలు చేస్తారు. వృత్తిపరమైన విషయాలలో ఉన్నత అధికారుల సహకారం, కింద పని చేసే సిబ్బంది సహాయం, ఆకస్మికమైన విషయాలలో కొంత లాభం, శుభకార్యాలకు ఆహ్వానాలు, స్త్రీల సహకారాన్ని పొందుతారు. భాగస్వామికి గుర్తింపు గౌరవం లభిస్తుంది. సంతానపరమైన విద్యా విషయాలు మొదలైన అంశాల మీద శ్రద్ధ విద్యార్థులు గట్టిగా కృషి చేయాలి.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభం సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకుంటారు. చుట్టుపక్కల వ్యక్తులతో కమ్యూనికేషన్ విషయాల్లో అపార్థాలు రాకుండా జాగ్రత్త పడాలి. ఆత్మీయులతో కలిసి మంచి వాతావరణంలో చిన్నపాటి ప్రయాణాలు గెట్ టుగెదర్లు ప్రణాళిక చేసుకుంటారు. శారీరక శ్రద్ధ ఆకర్షణ పెరుగుతాయి. సంతోషంగా ఉంటుంది, మిత్రులు తోబుట్టువుల సహకారం బాగుంటుంది. మాటలతో అందరినీ ఆకట్టుకుంటారు. జర్నలిజంకు గుర్తింపు. గృహ వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరమైన, భూ సంబంధ అంశములలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులు విద్య మీద ఎక్కువ శ్రద్ధ పెట్టాలి అనవసర విషయాలకు దూరంగా ఉండాలి.



## మిథున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా ఉన్నతాధికారులతో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తారు. భాగస్వామికి ఆర్థిక విషయాలలో అనుకూలంగా ఉంటుంది. రావలసిన ఆదాయము సమయానికి అందడంలో ఆనందం కలిగిస్తుంది. కుటుంబ వ్యక్తులతో కలిసి తీసుకునే నిర్ణయాలు ఆశావహంగా ఉంటాయి. వృత్తిపరంగా అధిక శ్రమ బాధ్యతలు పెరగడం వల్ల సమయానికి ఆహార స్వీకరణ విశ్రాంతి విషయాల్లో శ్రద్ధ వహించాలి. వారం మధ్యలో సామరస్యంగా పనులను వ్యక్తుల సహకారంతో సమస్యలను పరిష్కరించు కుంటూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళతారు. వాహనములు నడిపేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులకు అనుకూలమైన సమయంగా ఉంటుంది



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభం కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కొరకు ప్రయత్నం చేయు విద్యార్థులు శ్రమ అధికం చేస్తారు. ఆధ్యాత్మిక అంశాలలో పాల్గొంటారు. పూర్వము ఇచ్చిన రుణములు కొంత కష్టం మీద తిరిగి వస్తాయి. మనసుకు కొంత ఆహ్లాదకరంగా ఉంటుంది, సంతానము ఎక్కువ శ్రమతో విద్యలో ఆశించిన ఫలితములు, విద్యార్థులకు ఎలక్ట్రానిక్ సంబంధిత వస్తువుల కొరకు ఖర్చులు అధికంగా ఉంటాయి. భాగస్వామి కి వృత్తిపరమైన విషయాలలో అధికశ్రమ నూతన బాధ్యతలు. నూతన ప్రణాళికల కొరకు ఆలోచనలు చేస్తారు. దూర ప్రదేశాలలో ఉండే మిత్రుల సహాయలతో కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. ధైర్యం పెరుగుతుంది. కుటుంబం లోని వారి విజయం కొంత ఆనందాన్నిస్తుంది. తల్లిదండ్రుల సహకారం లభిస్తుంది



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో సంతానం కొరకు అధిక ఖర్చులు చేస్తారు. మాట విలువ పెరుగుతుంది. రావలసిన లాభాలు అందడంలో కొంత ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ అందు కోగలుగుతారు. గుర్తింపు గౌరవాన్ని పొందడంతో పాటు విదేశీ అవకాశాలు. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. సంతానమునకు అభివృద్ధి విదేశీ అవకాశాలు విద్యలో ముందు ఉండడం మీకు కొంత ఆనందాన్నిస్తుంది. కళాకారులకు అనుకూలమైన సమయం. సంతానమునకు సంబంధించిన అంశాలలో వారు కోరుకున్న విధంగా విజయ అవకాశాలు. వృత్తిపరమైన అభివృద్ధి ఉంటుంది. వృత్తిపరమైన విషయాలు వ్యాపారలావాదేవిలు కుటుంబ,గృహ, వాహన, భాగస్వామ్య అంశాలు చాలా వరకు మీకు అనుకూలంగా ఉంటాయి.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో విద్యాపరమైన అంశాలలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొన్ని విషయాలలో శ్రమకు తగిన ఫలితాలు వస్తుంది.ఆకస్మికమైన ఖర్చులు అధికంగాఉంటాయి. భాగస్వామికి ఆధ్యాత్మికపరమైన అంశాలలో, సాంఘికపరమైన విషయాలలో అభివృద్ధి ఉంటుంది. విజయ సాధనలో పోటీ పరీక్షలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. స్థిరాసుల మీద ఆదాయం అందుకోవడం జరుగుతుంది. మనసులోని కోరికలు నెరవేరడం, చిన్న నాటి మిత్రులను కలుస్తారు. స్త్రీలకు ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. సంతానమునకు వృత్తిపరమైన అవకాశాలు, ఉన్నత అధికారుల సహాయ సహకారాలు కొంత ప్రయత్నం మీద కష్టంగా అందుతాయి. భూ సంబంధిత వారసత్వ అంశాలలో సోదర వర్గంతో దీర్ఘంగా చర్చిస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో.విద్యార్థులుఉన్నతవిద్యలో గట్టి కృషి శ్రమతో ఆశించిన ఫలితాలను పొందుతారు. వృత్తిపరమైన బాధ్యతలు అధికంగా ఉంటాయి శ్రమ ఎక్కువగా ఉంటుంది .ఆరోగ్యం మీద శ్రద్ధ పెరుగుతుంది. బహుమానములు పొందు తారు. అత్యంత ఆత్మీయులు ,దూరప్రదేశంలో మిత్రులు సహకారంతో ఆగిన పనులు ముఖ్యముగా మీడియా సంబంధించి ముందుకు వెళ్ళడానికి ప్రణాళికలు వేసుకుంటారువారం మధ్యలో కుటుంబంలోని స్త్రీల సహకారం పొందుతారు. ఉన్నత అధికారుల సాయం కొరకు చేయు ప్రయత్నాలలో ఆలస్యం ఆటంకం ఇబ్బంది కలిగిస్తుంది. భాగస్వామితో అపార్థాలు రాకుండా జాగ్రత్త వహించాలి. దూర ప్రదేశాలలో ఉండే చిన్ననాటి మిత్రుల సహకారం బాగుంటుంది. ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో విశ్రాంతి లేని పనుల వల్ల వాటి ఫలితాల వలన కొంత అసంతృప్తి ఉంటుంది. ఆధ్యాత్మిక ఉపాసనాపరమైన అంశాలలో కొన్ని అవరోధాలు ఎదుర్కొంటారు. ఆర్థికపరమైన విషయాలలో కుటుంబ పెద్దల సహకారాన్ని ఆశిస్తారు. ప్రణాళిక లేని ప్రయాణాలు కొంత చికాకును, గందరగోళం కలిగిస్తాయి. భాగస్వామితో, సంతానము తో అపార్థములు రాకుండా ఆలోచించి మాట్లాడాలి. ముఖ్యమైన విషయాలకి మధ్యవర్తిత్వం మంచిది కాదు. కమ్యూనికేషన్ విషయాలలో ఆత్మీయుల మధ్య కొన్ని రకాలైన చికాకులు ఇబ్బంది పడతాయి. నూతన వృత్తుల కొరకు ప్రయత్నాలు చేస్తారు. సంతానం కొరకు, బహుమాన రూపంలో ఖర్చులు అధికంగా చేస్తారు. వృత్తిపరంగా రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు, భాగస్వామికి ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరాషాఢ 1వ పాదము

ప్రారంభంలో ముఖ్యమైన పనులు ఆకస్మికంగా వాయిదా పడతాయి ప్రతి విషయంలోనే ఆలస్యాలు ఆటంకాలు చికాకును కలిగిస్తాయి. సంతానమునకు కొత్త అవకాశాలు ఉన్నప్పటికీ వారము మధ్యలో మీ మాటల వల్ల కుటుంబ సభ్యులలో అపార్థాలకు అవకాశము, ఘర్షణలు రాకుండా జాగ్రత్త పడాలి. సంఘంలో గుర్తింపు గౌరవం పెరుగుతుంది, వృత్తిపరమైన అభివృద్ధి, నూతన వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి, ఆరోగ్య, ప్రయాణ విషయాలు మొదలైన ముఖ్యమైన అంశములలో తగిన శ్రద్ధ తీసుకోవాలి. సంబంధము లేని వ్యక్తుల ఊహించని విమర్శలు మనసుని కలవర పెడతాయి. స్థిరాస్తుల అంశాలలో రియల్ ఎస్టేట్ రంగంలో వారితో మెలకువగా వ్యవహరించాలి. పరిచయస్తులు మోసం చేసేందుకు అవకాశం ఉంది.



## మకర రాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వార ప్రారంభంలో సంఘంలో పలుకుబడి పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయాలు ఆరోగ్య మీద శ్రద్ధ అధికంగా ఉంటుంది రోగనిరోధక శక్తిని పెంచుకుంటారు.చాలా ఉత్సాహంగా ఉంటారు భాగస్వామికి సంబంధించిన ఖర్చు అధికంగా ఉంటాయి రుణములు చెల్లిస్తారు. కొత్తరుణం కొరకు ప్రయత్నం చేస్తారు విద్యార్థులకు పోటీ తత్వం పెరుగుతుంది. శ్రమకి తగిన ఫలితాన్ని పొందుతారు. సేవకులు సహకరిస్తారు. కుటుంబంలోని వ్యక్తులకు నూతన వృత్తిలో అవకాశాలు. సంతానానికి అభివృద్ధి. ఆత్మీయులైన మిత్రులతోనూ సోదరీ వర్గంతోనూ సమావేశాలు చర్చలు. కొత్త బహుమానాలు అందుకుంటారు. ఆరోగ్య శ్రద్ధ అవసరము, మానసిక ప్రశాంతత తగ్గుతుంది ఆకస్మిక అనవసరమైన ప్రయాణాలు,



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

ప్రారంభంలో గవర్నమెంట్ వృత్తుల కొరకు పోటీ పరీక్షలకు సంతానము చేయు ప్రయత్నాలకు మీ ఆత్మీయుల సహకారం తోడ్పాటు అందిస్తారు. సంతానము యొక్క అభివృద్ధి, వారికి నూతన అవకాశములు మీకు ఆశాజనకంగా ఉంటుంది. రావలసిన రుణములు అందుకుంటారు. విద్యార్థులు గట్టి శ్రమ మీద పరీక్షలకు సన్నద్ధులు అవుతారు. ముఖ్యముగా స్త్రీ సంతానం వృత్తిపరంగా చేసే ప్రయత్నాలలో అభివృద్ధికరంగా ఉంటుంది. ఉన్నత అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించాలి. విదేశాల కొరకు ఆహ్వానాలని అందుకుంటారు. వారం చివరిలో రీసర్చ్ చేయు విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. అభివృద్ధి కొరకు చేయు ప్రయత్నాలు సంతృప్తికరంగా ముందుకు సాగుతాయి. ముఖ్యమైన పనులు కొంత వాయిదా పడే అవకాశం ఉంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో విద్యాపరమైన విషయాలలో విద్యార్థులు చాలా శ్రమ పడతారు. ఉపాసన అంశాలలో కొన్ని అవరోధాలు చికాకును కలిగిస్తాయి. జ్ఞాపకశక్తిని మెరుగు పరుచుకునే విషయాల్లో శ్రద్ధవహించాలి వృత్తిపరంగా శ్రమ బాధ్యత అధికంగా ఉన్నప్పటికీ తగిన గౌరవాన్ని పొందుతారు నూతన ప్రయత్నాలు చేస్తారు. సమయానికి ఆహార స్వీకరణ తగిన విశ్రాంతి అవసరము. ఆర్థిక విషయాలలో స్థిరాస్తుల అంశాలలో వాతావరణం కొంత చికాకుగా ఉన్నప్పటికీ, పెద్దల సహకారంతో దాన్ని అధిగమిస్తారు. భాగస్వామి వృత్తిపరమైన విషయాలలో కొంత అభివృద్ధి మీకు సంతోషాన్ని కలిగిస్తుంది. నూతన వాహన గృహ కొనుగోలు కొరకు ఆలోచనలు అధికం చేస్తారు. వారం మధ్యలో రావలసిన బాకీలను వసూలు చేసుకుని ఊరట


కేత్నా రాజ్